ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
స్త్రీ వారికి మొదటి అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం 04 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 65 | Thursday 04 June 2026 | Vol.No 28 Issue No .65 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA | www.visionandhra.in

## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

### జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

### మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి



హైదరాబాద్,జూన్3 : తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ మిగతా2లో..

## తెలంగాణ, తురింగియా మధ్య కీలక ఒప్పందం

- టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం
- యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్



హైదరాబాద్,జూన్3 తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటు న్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మిగతా2లో..

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి
- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ



మిగతా2లో..

## కర్ణాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినెట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి

బెంగళూరు,జూన్ 3 : కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్



మిగతా2లో..

## చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్

- మెజార్టీ ఎమ్మెల్యేల తిరుగుబావుటా
- 59మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది
- బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ వెల్లడి



కోల్‌కతా,జూన్3 : అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మిగతా2లో..

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

- తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

హైదరాబాద్,జూన్ 3 : తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి మిగతా2లో..

## తెలంగాణ పోరాటాల గడ్డ

- పోరాడితేనే తెలంగాణ వచ్చింది
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై గద్దర్ తనయ విమర్శలు



హైదరాబాద్,జూన్ 3 : తెలంగాణ మీ అయ్య జాగీరా..? అంటూ జనసేన చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా ఖండించారు. పవన్ కల్యాణ్ కామెంట్స్ మిగతా2లో..

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అన్నం తినలేదన్నావ్
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా
- మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
- పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్,జూన్3 : తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం,



జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? మిగతా2లో..

## పండు మాస్టర్‌కు ప్రమాదం లేదన్న వైద్యులు

- విశాఖ ఆస్పత్రిలో కాళ్లకు శస్త్ర చికిత్సలు
- రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలు



విశాఖపట్టణం,జూన్3 : ప్రఖ్యాత డ్యాన్స్ షో 'ఢీ' ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువైన ప్రముఖ కొరియోగ్రాఫర్, డ్యాన్సర్ పండు మాస్టర్ విశాఖపట్నంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స మిగతా2లో..

## రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

- పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు
- రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్టేట్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు



మాస్కో,జూన్3 : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర మిగతా2లో..

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు
- ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ,జూన్3 :దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా మిగతా2లో..

## ఆరోగ్యం ఉంటేనే సంపద

- సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు
- యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు
- 21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

గుంటూరు,జూన్ 3 : ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32



విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు మిగతా2లో..

## రాజకీయాల్లో కులదూషణలు దారుణం

### అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం

### ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన

అమరావతి,జూన్ 3 : భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.




అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత మిగతా2లో..

## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాటాల గడ్డ

నేపథ్యంలో వెన్నెల మాట్లాడుతూ.. పవనన్న మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటారు. కానీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖచ్చితంగా ఖండిస్తున్నానన్నారు. తెలంగాణ సినిమాల్లో నటిస్తే రాలేదు.. తెలంగాణ పొత్తులకు పోతే రాలేదు. పైసలు పంచితే రాలేదు.. లాబీలు చేస్తే రాలేదు. తెలంగాణ పోరాటం ఓ సాయుధ పోరాటం. తమ రక్తం చిందించిన గడ్డగా నిలబడ్డ తెలంగాణ బిడ్డల త్యాగాల పోరాటం. తెలంగాణ ఒక ఆత్మగౌరవపోరాటం. ఎవరినీ ఒక్క బాధపెట్టుకుండా.. హింసించకుండా తమను తాము ఆహూతి చేసుకున్న శ్రీకాంత్ చారియే సాక్ష్యమన్నారు. తెలంగాణ పోరాటం ఒక సాంస్కృతిక యుద్ధం. పాటలతో మాటలతో ప్రజల్లోకి వెళ్లి.. గడపగడపకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసిన పోరాట గాథలున్న ఈ తెలంగాణ గడ్డ. మా భూములు మావి.. మా నీళ్లు మావి..మా పాలన మాది అనే నినాదంతో ప్లలెప్లలె గడప గడప త్యాగాలు చేసి సాధించుకున్న పోరాట గడ్డ. తెలంగాణ మా అయ్యల జాగీరే, రేపు మా బిడ్డల జాగీరు కూడా అంటూ వెన్నెల వ్యాఖ్యానించారు.

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## రాజకీయాల్లో కులదూషణలు దారుణం

భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## పండు మాస్టర్‌కు ప్రమాదం లేదన్న వైద్యులు

పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యు లు తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం ప్రమాదంలో పండు మాస్టర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా హిప్ జాయింట్ డిస్‌లొకేట్ కావడంతో పాటు మోకాళ్ల కింద భాగంలోని ఎముకలు, జాయింట్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తిచేసిన అనంతరం ఒక సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. హిప్ జాయింట్‌కు సంబంధించిన సమస్యను తొలి ఆపరేషన్ ద్వారా పరిష్కరించామని, మిగిలిన గాయాలకు సంబంధించి మరికొన్ని శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని డాక్టర్లు తెలిపారు. ప్రమాద సమయంలో తలకు కూడా గాయం అయినప్పటికీ ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పండు మాస్టర్ అభిమానులను ఎక్కువగా ఆందోళనకు గురిచేసిన అంశం ఆయన భవిష్యత్తులో మళ్లీ డ్యాన్స్ చేయగలరా అనే ప్రశ్న. దీనిపై వైద్యులు సానుకూల సమాచారం ఇచ్చారు. అవసరమైన శస్త్రచికిత్సలు పూర్తయిన తర్వాత కనీసం ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడిన అనం తరం తిరిగి తన డ్యాన్స్ కెరీర్‌ను కొనసాగించవచ్చని, ప్రస్తుతం అం దుకు ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించడం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ సమాచారం అభిమానులకు కొంత ఊరటనిచ్చిం ది. మంగళవారం పండు మాస్టర్ తన బృందంతో కలిసి విశాఖ జిల్లా తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ప్రయాణం చేస్తుండగా ఆనందపురం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణం మధ్యలో టీమ్‌లోని ఒక డ్యాన్సర్ అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఆ సమయంలో పండు మాస్టర్ కారులో నుంచి దిగి వెనుక భాగంలో నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్ అదుపు తప్పి కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో కారు, వ్యాన్ మధ్య పండు మాస్టర్ చిక్కుకుపోయారు. దీంతో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, సహచరుల సహాయంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తుంది.

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు.1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు.

1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

## చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్

మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తు న్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీఎంసీలో కొనసాగుతోన్న గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ భాజపా నేత దిబ్యేందు అధికారి ప్రకటించారు. అయితే ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి తీసుకోకూడదని భాజపా అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. టీఎంసీ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రమయ్యే రోజు దగ్గరలోనే ఉందని.. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ పతనం వైపు పయనిస్తోందని అన్నారు.

## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

హైదరాబాద్,జూన్3 : భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

# తెలంగాణ, తురింగియా మధ్య కీలక ఒప్పందం

మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్టర్న్ ఎ÷-లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్గి÷డ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# ఆరోగ్యం ఉంటేనే సంపద

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మమత కోటకు బీటలు !

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ది చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాక ముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగు డుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధఙకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు.

# రిమోట్ సర్పంచ్ పై గ్రామస్తుల ఫిర్యాదు, భర్తదే హవా అంటూ ఆరోపణ

- నా భార్య కాదు, నేనే సర్పంచ్
- సమావేశాలు, బిల్లులు, కాంట్రాక్టులు భర్త ఆధీనంలోనే
- నేనే సర్పంచ్, చెప్పుతో కొడతా అంటూ బెదిరింపులు
- మహిళా సర్పంచ్‌కు స్వతంత్రంగా పనిచేసే అవకాశం ఇవ్వాలని వినతి
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు ఫిర్యాదు



జడ్చర్ల/బాలానగర్, జూన్ 3,(విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం, బాలానగర్ మండలం నేరళ్లపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ విధులను భర్త నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌గా ఎన్నికైన సమిన బేగం పేరుకే ఉన్నారని, అసలు అధికారం భర్త జామిర్ పాషా చేతిలో ఉందని గ్రామస్తులు ఆరోపించారు. అధికారిక సమావేశాలు, గ్రామసభల నిర్వహణ నుంచి పంచాయతీ అభివృద్ధి నిధులు, కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపుల వరకు అన్నీ ఆయనే చూసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో ఏ పనులు చేపట్టాలి, ఎవరికి పథకాలు మంజూరు చేయాలనే తుది నిర్ణయాలు కూడా భర్తే తీసుకుంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు సర్పంచ్ వద్దకు కాకుండా భర్త వద్దకే వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఇటీవల ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనవద్దని సుధాకర్ గౌడ్, జల్లి.శ్రీశైలం అనే వ్యక్తులను హెచ్చరించి, గ్రామ పంచాయతీలో వారిపై దాడి చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఘటనపై పాలకవర్గ సభ్యులు, వార్డు మెంబర్లు నిలదీయగా నా భార్య కాదు, నేనే సర్పంచ్. మరోసారి నన్ను సర్పంచ్ కాదంటే చెప్పుతో కొడతా అని జామిర్ పాషా బెదిరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్ విధులకు ఆటంకం కలిగిస్తూ అధికారిక కార్యక్రమాలన్నీ తానై వ్యవహరిస్తున్న జామిర్ పాషాపై, దీనికి సహకరిస్తున్న సర్పంచ్ సమిన బేగంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎంపీడీఓను కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా సర్పంచ్‌కు స్వతంత్రంగా పనిచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# జడ్చర్ల గడ్డపై సీఎం రేవంత్, జూన్ 5న భారీ సభ

**గంగాపూర్ రోడ్డులో బహిరంగ సభ**

**వేదిక, పార్కింగ్, భద్రతపై మంత్రి, ఎమ్మెల్యేల సమీక్ష**

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం**

**సీఎం పర్యటనతో అభివృద్ధికి బాట ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



జడ్చర్ల, జూన్ 3,(విజన్ ఆంధ్ర): జూన్ 5న జడ్చర్ల పట్టణానికి రానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గంగాపూర్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సభా స్థలాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక, ప్రజలు కూర్చునే ఏర్పాట్లు, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని జడ్చర్లకు ముఖ్యమంత్రి రాక నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే అవకాశంగా ఈ పర్యటన నిలుస్తుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# టిజిఎస్ఆర్‌టిసి స్పెషల్ టూర్!!

**గోవాతో పాటు 8 పుణ్యక్షేత్రాల సందర్శన**

**సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం**

**టికెట్ ధర రూ.6,800 ఒక్కొక్కరికి**

**గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపో ఆధ్వర్యంలో ప్రయాణీకుల కోసం ఒక అద్భుతమైన ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బస్సు ద్వారా గోవాతో పాటు దేశంలోని ప్రముఖ 8 పుణ్యక్షేత్రాలైన హంపి, గోకర్ణ, మురుడేశ్వర్, ఉడిపి, ధర్మస్థల, కుక్కే సుబ్రహ్మణ్య, మంత్రాలయంలను ఒకే యాత్రలో సందర్శించే సువర్ణావకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీ బస్సు వచ్చే వారం అనగా తేది 10-06-2026 (బుధవారం) రోజున మధ్యాహ్నం 1గంటలకు గోదావరిఖని డిపో నుండి ప్రయాణీకులతో బయలుదేరనుంది. ఈ మొత్తం ఆధ్యాత్మిక, వినోదాత్మక పర్యటన కాలవ్యవధి వారం రోజుల పాటు సాగుతుందని, నిర్దేశిత క్షేత్రాలన్నింటినీ చుట్టి వచ్చిన అనంతరం బస్సు సురక్షితంగా తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుందని డిపో మేనేజర్ ఎం. నాగభూషణం అధికారిక ప్రకటనలో తెలిపారు. ఈ సుదీర్ఘ ప్రత్యేక యాత్రకుగాను పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 6,800లుగా రవాణా ఛార్జీని నిర్ణయించడం జరిగింది. అయితే ప్రయాణ సమయం, బస చేసే రోజుల్లో భోజన, వసతి ఖర్చులను ప్రయాణీకులే స్వయంగా భరించాల్సి ఉంటుంది. ఈ అద్భుత యాత్రలో పాల్గొనడానికి ఆసక్తి ఉండి, సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారు, మరిన్ని పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకునే భక్తులు, ప్రయాణీకులు వెంటనే డిపో సంప్రదింపు నంబర్లయిన 7013504982, 7382847596 లను సంప్రదించి తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాల్సిందిగా డిపో మేనేజర్ కోరారు.

# హెచ్‌పీసీఎల్ భద్రతపై సీపీ తనిఖీ!!

**అప్రమత్తతే రక్షణ**

**భద్రతా ప్రమాణాలు మరింత పటిష్టం చేయాలి**

**సీసీ కెమెరాలు, ఎమర్జెన్సీ ఏర్పాట్లపై సూచన**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : పరిశ్రమలు కేవలం ఉత్పత్తి కేంద్రాలు మాత్రమే కాదు... వేలాది కుటుంబాల జీవనాధారాలు. అలాంటి కీలక పారిశ్రామిక సంస్థల్లో భద్రత ఎంత పటిష్టంగా ఉంటే, ప్రజల భవిష్యత్తు అంత భద్రంగా ఉంటుందనే సందేశాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మరోసారి చాటిచెప్పారు. బుధవారం కుందనపల్లి సమీపంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)ను సందర్శించిన కమిషనర్, అక్కడ అమలు చేస్తున్న భద్రతా వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు నుంచి అగ్నిప్రమాదాల నివారణ చర్యల వరకు ప్రతి అంశాన్ని పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతే ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్న ఆయన, సిబ్బంది ఎప్పటికప్పుడు మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తూ సిద్ధంగా ఉండాలని సూచించారు. పరిశ్రమల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన వాహనాల డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. పరిశ్రమలు సురక్షితంగా ఉంటేనే కార్మికుల కుటుంబాలు ప్రశాంతంగా ఉంటాయని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పరిశ్రమల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, భద్రత ఈ మూడు సమపాళ్లలో సాగినప్పుడే సమాజం మరింత ముందుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు.

# ప్రీ-ప్రైమరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం!!

## జూన్ 9లోగా ఇన్స్ట్రక్టర్లు, ఆయాల పోస్టులకు అప్లై చేయండి

## తాత్కాలిక నియామకాలకు డీఈవో శారదా ప్రకటన



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లాలో ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారదా తెలిపారు. ఈ తరగతుల నిర్వహణ కోసం తాత్కాలిక ప్రాతిపదికన 10 నెలల గౌరవ వేతనంతో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హతతో పాటు బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అవసరమని తెలిపారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించే విధంగా గ్రామం, మండలం, జిల్లా ఆధారంగా ఎంపిక చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలని, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం వయో సడలింపులు వర్తిస్తాయని చెప్పారు. విద్యార్హతలు, వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాల ప్రతులతో కూడిన దరఖాస్తులను సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జూన్ 9 సాయంత్రం వరకు సమర్పించాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.శారదా కోరారు.

# పదో తరగతిలో 100% ఉత్తీర్ణతే లక్ష్యం

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ఫిజిక్స్, ఇంగ్లీష్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి**

**వెనుకబడిన విద్యార్థుల కోసం సులభమైన పద్ధతిలో ప్రత్యేక పుస్తకాల రూపకల్పన**

**ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి కావాలి**

**ఉపాధ్యాయులకు ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 3 (విజన్ ఆంధ్ర): రాబోయే విద్యా సంవత్సరంలో జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పదో తరగతి ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రత్యేక బోధన అంశంపై సంబంధిత ఉపాధ్యాయులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలి ఎస్సెస్సీ ఫలితాలను సమీక్షిస్తూ ఉపాధ్యాయులకు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. గత ఫలితాల్లో ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో కొందరు విద్యార్థులు అనుత్తీర్ణులు (ఫెయిల్) అయిన నేపథ్యంలో.. ఈ విద్యా సంవత్సరంలో ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

గత అనుభవాలతో ముందుకు.. : గడచిన విద్యా సంవత్సరంలో గణితం (మ్యాథ్స్) సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించి, ప్రత్యేకంగా బోధించడం వల్ల మంచి ఫలితాలు సాధించామని కలెక్టర్ గుర్తుచేశారు. అదే విధానాన్ని ఈసారి ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లోనూ అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఈ రెండు సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యేలా, ప్రాథమిక అంశాలతో కూడిన ప్రత్యేక పుస్తకాలను రూపొందించాలని.. ఈ నెలాఖరులోగా ఈ పుస్తకాల తయారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

బేస్‌లైన్ పరీక్షతో వెనుకబడిన వారి గుర్తింపు ఆదర్శ్ సురభి, జిల్లా కలెక్టర్ ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులకు ముందుగా ఒక సులభమైన పరీక్ష (బేస్‌లైన్ టెస్ట్) నిర్వహించాలి. దాని ద్వారా ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి.. వారికి ఇప్పుడు రూపొందించబోయే ప్రత్యేక పుస్తకాల ద్వారా ప్రాథమిక స్థాయి నుండి బోధించాలి. విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ రెండు సబ్జెక్టులతో పాటు అన్ని విషయాల్లోనూ జిల్లాలో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా సంపూర్ణ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని గణిత, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం

## డాక్టర్ రామకృష్ణ ప్రసాద్




సిద్దిపేట, జిల్లా ప్రతినిధిజూన్ 3: క్యాన్సర్ వ్యాధికి మనోధైర్యాన్ని మించిన వైద్యం మరొకటి లేదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యశోద ఆసుపత్రిలో రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో 'హైపర్‌సైట్' సాంకేతికత ద్వారా క్యాన్సర్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతానికే రేడియేషన్ అందించడంతో మిగతా శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయని వివరించారు. ఈ హైపర్‌సైట్ మిషన్ ఇండియాలో ఎక్కడ లేదని, ఒక్క సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే కలదన్నారు. ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అందించి కోలుకునేలా చేశామని తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత ఈ-హైవేల అభివృద్ధికి 'నెట్రాడైన్-ఎన్‌హెచ్‌ఈవీ' భాగస్వామ్యం




హైదరాబాద్, జూన్ 03 (విజన్ ఆంధ్ర) : భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) సుదూర రవాణాను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఏఐ ఆధారిత ఫ్లీట్ సేఫ్టీ టెక్నాలజీ సంస్థ 'నెట్రాడైన్-ఎన్‌హెచ్‌ఈవీ' వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు ఎన్‌హెచ్‌ఈవీ ప్రోగ్రామ్ డైరెక్టర్ అభిజీత్ సిన్హా బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెట్రాడైన్ ఈఎంఈఏ, ఏపాక్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దుర్గాదత్ నేదుంగడి తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం ప్రకారం ఎన్‌హెచ్‌ఈవీ కారిడార్లలో నడిచే కమర్షియల్ ఈవీలలో నెట్రాడైన్ ఏఐ సొల్యూషన్లు అమలు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వాహనాల రియల్‌టైమ్ ట్రాకింగ్, డ్రైవర్ ప్రవర్తన విశ్లేషణ, ప్రమాదాలను ముందుగానే గుర్తించడం, వాహన నిర్వహణ పర్యవేక్షణ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

# మాన్‌సూన్ రెగట్టా టోర్నీలో నిల్కొండ మణి సంచలనం



హైదరాబాద్, జూన్ 03 (విజన్ ఆంధ్ర) : హుస్సేన్ సాగర్‌లో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 17వ మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజున మల్కాజ్‌గిరికి చెందిన 13 ఏళ్ల నిల్కొండ మణి సంచలన విజయం సాధించాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా షెడ్యూల్‌లోని మూడు రేసుల్లో ఒకే రేసు నిర్వహించగా, మణి తన సమీప ప్రత్యర్థిపై దాదాపు రెండు నిమిషాల ఆధిక్యంతో మొదటి స్థానంలో నిలిచాడు. బాలుర అండర్-15 విభాగంలో నిల్కొండ మణి(1పాయింట్) అగ్రస్థానంలో ఉండగా, వుట్ల నరసింహ(2 పాయింట్లు), కొండ సమన్యు(3 పాయింట్లు) తరువాతి స్థానాల్లో నిలిచారు. బాలికల అండర్-15 విభాగంలో సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన సృష్టి సింగ్ అద్భుత ప్రదర్శనతో ఓవరాల్‌గా మూడో స్థానం, బాలికల విభాగంలో తొలి స్థానం సాధించింది. ఆమె 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, సాక్షి కుమారి(8 పాయింట్లు), శృంగారి రాయ్(10 పాయింట్లు) తరువాతి స్థానాల్లో నిలిచారు. ప్రతికూల వాతావరణం కారణంగా అండర్-18 రేసులు వాయిదా పడ్డాయి.

# గ్రామ, వార్డు సభల నిర్వహణపై సమీక్ష
# అధికారులకు దిశానిర్దేశం చేసిన అదనపు కలెక్టర్లు

నిజామాబాద్, జూన్ 03 : (విజన్ ఆంధ్ర )ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10వ తేదీలలో పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసిల్దార్లు, ఎం.పీ.ఓలు, వివిధ శాఖల అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు గ్రామ, వార్డు సభల నిర్వహణకు సంబంధించి పాటించాల్సిన విధి, విధానాలు, ప్రస్తావించాల్సిన అంశాలు, ప్రజలకు విశదపర్చాల్సిన విషయాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం గురించి అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు దిశానిర్దేశం చేశారు. గ్రామ, వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని అన్నారు. సభ నిర్వహణకు ఒకరోజు ముందే టాంటాం ద్వారా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తుగానే సమాచారం తెలియజేయాలని తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ గురించి సభలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఈ కార్యక్రమానికి సహకరించాల్సిందిగా కోరాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ అమలులో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర క్రియాశీలకం అయినందున రాజకీయ పార్టీలు సత్వరమే బీ.ఎల్.ఏలను నియమించుకుని నిర్దేశిత నమూనాలో జాబితాను సమర్పించేలా ప్రజాప్రతినిధులను కోరాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు,



విత్తనాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటల మార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేయాలని, వర్షపు నీటి నిలువ, పొదుపుగా సాగు జలాల వినియోగం, అవసరం మేరకే ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించాలని హితవు పలికారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, ప్రకృతి సమతుల్యత కోసం అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. అనుకోని రీతిలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆపదమిత్ర వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవడం, ఎవరికైనా విపత్తుల వల్ల నష్టం సంభవిస్తే ఆయా పథకాల ద్వారా ప్రభుత్వాలు అందించే నష్టపరిహారం గురించి సభలలో తెలియజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తడి,పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై ప్రజల్లో అవగాహనను పెంపొందించాలని, వాల్టా, వన్యప్రాణి సంరక్షణ చట్టాల గురించి తెలియజేయాలని సూచించారు. రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, సానిటేషన్ వంటి వాటి కోసం ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరిస్తూ, వారి నుండి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరిస్తూ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములయ్యేలా చూడాలని, రహ్ వీర్ వంటి పథకాల గురించి వారికి విశదపర్చాలని అన్నారు. ఆపద్బంధు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వంటి వాటిని అర్హులైన వారి సద్వినియోగం చేసుకునేలా ఆయా పథకాల గురించి అర్ధమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం గురించి, రెండవ విడత ఇళ్ళ మంజూరీ ప్రక్రియ గురించి సభలలో వివరించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, గ్రామ, వార్డు సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, డీ.ఎఫ్.ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కన్నవారి కలలే...పిల్లల భవిష్యత్తు!!

**తల్లిదండ్రుల కళ్లల్లో చూసే ఆనందమే జీవితానికి సార్థకత**

**కన్నవారి కష్టాన్ని గుర్తించి, వారి కలలను నిజం చేయడమే పిల్లల బాధ్యత**

**మంథని కీర్తిని చాటిన బంగారు కుసుమాలకు అభినందనలు**

**మాజీ జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : రెక్కలు ముక్కలు చేసుకుంటూ, కడుపు కట్టుకుని, తమ పిల్లల భవిష్యత్తే సర్వస్వంగా భావించి రాత్రింబవళ్లు శ్రమించే ప్రతి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడటమే నిజమైన దైవదర్శనమని, ఆ కన్నవారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత నేటి యువతపై ఎంతైనా ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ భావోద్వేగంతో పిలుపునిచ్చారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి, ఎన్నో కష్టనష్టాలకోర్చి చదువుకుని ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, ఐఐటీ ఎంట్రన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, దేశంలోనే అత్యున్నతమైన రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుని మంథని గడ్డ గర్వపడేలా చేసిన ఆణిముత్యాల్లాంటి విద్యార్థులను బుధవారం మంథని పట్టణంలోని 'రాజగృహం' వేదికగా అత్యంత వైభవంగా సన్మానించారు. తమ పిల్లలు సాధించిన ఈ అసాధారణ విజయాలను చూసి ఆ తల్లిదండ్రుల కళ్లలో ఆనంద బాష్పాలు రాలగా, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దంపతులు ఆ విద్యార్థులను, వారిని కన్న తల్లిదండ్రులను స్వయంగా శాలువాలతో ఘనంగా సత్కరించి, నోరు తీపి చేస్తూ ఆశీస్సులు అందజేసిన తీరు అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించింది. ఒక సాధారణ గ్రామీణ ప్రాంతం నుండి దేశ స్థాయి అత్యున్నత శిఖరాలను అధిరోహించిన ఈ బిడ్డల వెనుక ఉన్న తల్లిదండ్రుల నిరంతర త్యాగాలను కొనియాడుతూ, సమాజంలో ఎంత ఎదిగినా మిమ్మల్ని ఇంతటివారిని చేసిన కన్నవారిని, పుట్టిన గడ్డను మరువకూడదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎంతో ఆత్మీయంగా, భావోద్వేగాల కలయికగా సాగిన ఈ అభినందన సభలో ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి గుండెల్లో ఆనందాన్ని నింపుకున్న తల్లిదండ్రులు, స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ హృదయపూర్వక చప్పట్లతో అభినందనలు తెలియజేశారు.

# అనాథ చిన్నారికి ఎమ్మెల్యే మేఘారెడ్డి అభయహస్తం

**అవ్వ, తాత, తల్లిదండ్రులు మృతి..**

**కన్నీరుమున్నీరవుతున్న బాలిక భవ్యశ్రీ**

**నేనున్నానంటూ భరోసా కల్పించిన వనపర్తి శాసనసభ్యులు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 3 (విజన్ ఆంధ్ర): అవ్వ లేదు.. తాత లేదు.. కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లి కూడా అనంత లోకాలకు వెళ్ళిపోయింది.. ఇక నన్ను ఎవరు చేరదీస్తారు? నాకెవరున్నారు? అంటూ ఆ చిన్నారి రోదించిన తీరు స్థానికులను సైతం కన్నీటిపర్యంతం చేసింది. తీవ్ర విషాదంలో ఉన్న ఆ అనాథ చిన్నారికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నేనున్నానంటూ అభయహస్తం అందించారు.

వివరాల్లోకి వెళ్తే.. పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుటుంబానికి చెందిన రేణుక అనే మహిళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. రేణుకకు ఇదివరకే తల్లిదండ్రులు చనిపోగా, భర్త కూడా లేదు. తనకు ఆరోగ్యం బాగోలేదని, త్వరలోనే చనిపోతానని తెలిసి కూడా తన చిన్నారి కూతురు భవ్యశ్రీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ 5వ తరగతి వరకు చదివించింది. గత కొంతకాలంగా ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఆమె ఇంట్లోనే ఉంటోంది.

ఆసుపత్రికి తరలించినా దక్కని ప్రాణం: మంగళవారం రాత్రి రేణుక ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో బంధువులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి చేయి దాటిపోవడంతో ఆమె కన్నుమూసింది. దీంతో బంధువులు మృతదేహాన్ని తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. తనకు దిక్కైన తల్లి కూడా దూరమవడంతో చిన్నారి భవ్యశ్రీ గుండెలవిసేలా ఏడ్చిన ఏడుపులు చూసేవారిని తీవ్రంగా కలచివేసాయి.

చందాలు వేసుకున్న గ్రామస్తులు: తీరని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి కనీసం రేణుక అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా స్తోమత లేకపోవడంతో, గ్రామస్తులే స్వచ్ఛందంగా చందాలు వేసుకుని దహన సంస్కారాలు పూర్తి చేశారు.

చదువు, బాగోగులు నాదే బాధ్యత: ఎమ్మెల్యే మేఘారెడ్డి ఈ హృదయ విదారక ఘటన గురించి తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తక్షణ సహాయం కింద బాధితురాలి కుటుంబానికి రూ. 5,000 నగదును అందజేశారు. అంతేకాకుండా, ఆ చిన్నారి భవిష్యత్తు గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. భవ్యశ్రీ చదువుతో పాటు, ఆమె పూర్తి బాగోగులను తానే స్వయంగా చూసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. చిన్నారికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.

# జీజీహెచ్‌లో తొలి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం

నిజామాబాద్ జూన్03 ( విజన్ ఆంధ్ర): నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇద్దరు మహిళలకు తొలిసారి నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైంది. ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ సర్జరీ ద్వారా చేపట్టిన చికిత్స విజయవంతం కావడంతో ఇద్దరు మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరిటెండెంట్ నాగ మోహన్ బుధవారం వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తొలి ప్లాస్టిక్ సర్జరీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించబడింది. గాంధారి మండలానికి చెందిన లచ్చవ్వ (45 సంవత్సరాలు) అనే రోగికి ముఖం ఎడమ చెంప భాగంలో (బాసల్ సెల్ కారసి నోమా ) వ్యాధి నిర్ధారణ కావడంతో, ప్లాస్టిక్ సర్జన్ డా. శివాని ఆధ్వర్యంలో రొటేషన్ ఫ్లాప్ రికన్స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శస్త్రచికిత్స సర్జరీ విభాగాధిపతి డా. విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉండి, కోలుకుంటున్నారని నాగ మోహన్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నిజామాబాద్‌లో నిర్వహించిన మొట్టమొదటి ప్లాస్టిక్ సర్జరీ కేసు విజయవంతం కావడం వైద్యుల మెరుగైన సేవలకు నిదర్శనం అన్నారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు మరింత విస్తరిస్తున్నాయని డాక్టర్ నాగమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్య బృందాన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి కట్టుబడి ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇదే ఆస్పత్రిలో నిజామాబాద్ నగరానికి చెందిన మమత అనే మహిళకు



కాలుకు దీర్ఘకాలిక వ్యాధి సోకడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. చికిత్స నిమిత్తం ఆమె జిల్లా జనరల్ ఆస్పత్రికి రాగా ప్లాస్టిక్ సర్జరీ ద్వారా చికిత్స అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగుగా ఉందని ఆమెకు శస్త్ర చికిత్స అందించిన డాక్టర్ శివాని తెలిపారు.

# మత్తు పదార్థాల నిరోధానికి, సమిష్టిగా కృషి చేయాలి
## అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



నిజామాబాద్, జూన్ 03 :( విజన్ ఆంధ్ర) మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరుగగా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకపై అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, మత్తు పదార్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు లక్ష్యాలను అధిగమించాలి
## - జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 3 ( విజన్ ఆంధ్ర ) : వరి ధాన్యం సేకరణకు రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి మాట్లాడుతూ...జిల్లాలోని ప్రతి మిల్లరు 2 లక్షల 20 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకునే విధంగా అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. జూన్ 6వ తేదీ వరకు లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి ధాన్యమును మిల్లర్లు సేకరించాలని ఆయన తెలిపారు. జిల్లాలో గల 130 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఎప్పటికప్పుడు మిల్లర్లకు తరలించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా ధాన్యం సేకర జరగాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం అవుతుందని, హమాలీల సంఖ్యను పెంచుకొని సమస్యను అధిగమించాలని ఆయన తెలిపారు. లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో చేర్చేందుకు లారీల సంఖ్యను కూడా పెంచుకోవాలని ఆయన సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆయన తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, తూనిక, తేమ యంత్రాలు ఉండేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. వరి ధాన్యం నిల్వల నిమిత్తం అదనంగా మధ్యంతర గోదాములకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల జనరల్ మేనేజర్ అభిషేక్, డీజీఎం ఇర్ఫాన్, సూపరింటెండెంట్ ఇద్రీష్, పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా సహకార అధికారి నాగార్జున, డిసిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రామ్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ నర్సింలు, డిపిఎం కొమురయ్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి
## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్


హన్మకొండబ్యూరోచీఫ్( విజన్ఆంధ్ర)జూన్ 3: భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు..ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడి షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి



ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ,ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్‌కుమార్,కళ్యాణ్‌కుమార్, రాజమౌళి పాల్గొన్నారు.

# కామారెడ్డి విద్యా శాఖ అధికారి రాజు బదిలీ

కామారెడ్డి బ్యూరో జున్3(విజన్ ఆంధ్ర): బదిలీ పై వెళుతున్న విద్యా శాఖ అధికారి రాజును బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ డిఇఓ రాజును శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం.



# పవన్ వ్యాఖ్యలపై వంశీకృష్ణ ఫైర్!!

**తెలంగాణపై ప్రేమ ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చింది?**
**నాడు మౌనం వహించి, నేడు ప్రేమ ఒలకబోస్తారా?**
**త్యాగాల తెలంగాణపై రాజకీయాలు వద్దు**
**మాటలు కాదు.. చేతలే ముఖ్యం**
**తెలంగాణ కోసం ఎవరు పోరాడారో ప్రజలకు తెలుసు**
**కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షమే**
**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ అనే పేరు వినగానే వేలాది కుటుంబాల కన్నీళ్లు, వందలాది అమరవీరుల త్యాగాలు, కోట్లాది ప్రజల ఆత్మగౌరవ పోరాటం గుర్తుకు వస్తుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడిని, నరేంద్ర మోదీని గతంలో తీవ్ర స్థాయిలో విమర్శించి, ఎన్నికలు రాగానే వారితోనే చేతులు కలిపి డిప్యూటీ సీఎం పదవి పొందిన అతను తెలంగాణకు న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. తెలంగాణ కోసం పోరాటం జరిగినప్పుడు మీ గళం ఎక్కడ ఉంది? తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించిన సందర్భాల్లో ఎందుకు స్పందించలేదు? ముందుగా మీ రాజకీయ వైఖరికి సమాధానం చెప్పండి. తెలంగాణ ప్రజలకు ఎవరు మద్దతుగా నిలిచారో, ఎవరు అవసరానికి అనుగుణంగా మాటలు మార్చారో బాగా తెలుసు. తెలంగాణ ప్రజలు మాటలను కాదు, చేతలను నమ్ముతారు. తెలంగాణ గురించి ఇప్పుడు ప్రేమ చూపిస్తున్నామని చెప్పే వారి మాటలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం విద్యార్థులు తమ ప్రాణాలను అర్పించినప్పుడు, యువత వీధుల్లో ఉద్యమ జ్వాలలు రగిలించినప్పుడు, తల్లిదండ్రులు తమ పిల్లలను కోల్పోయి కన్నీరు మున్నీరైనప్పుడు తెలంగాణ పక్షాన నిలబడని వారు ఇప్పుడు తెలంగాణ కోసం మాట్లాడటం ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు వచ్చిన ప్రతిసారి మౌనం పాటించిన వారు, తెలంగాణకు అన్యాయం చేసిన శక్తులతో రాజకీయంగా చేతులు కలిపిన వారు నేడు తెలంగాణ ప్రేమ గురించి మాట్లాడటం ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడమేనని విమర్శించారు. తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చిన వ్యాఖ్యలు వెలువడినప్పుడు స్పందించని వారు, తెలంగాణ యువత మనోభావాలు దెబ్బతిన్నప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడతామని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. తెలంగాణ సాధన వెనుక ఉన్న ప్రతి కన్నీటి చుక్కకు, ప్రతి త్యాగానికి కాంగ్రెస్ పార్టీ సాక్ష్యమని, రాష్ట్ర ఆవిర్భావం కోసం చివరి వరకు పోరాడి తెలంగాణ కలను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని వంశీకృష్ణ పేర్కొన్నారు. పదవుల కోసం కాదు... ప్రజల కోసం. రాజకీయ లాభాల కోసం కాదు... తెలంగాణ గౌరవం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, రాష్ట్ర హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, తెలంగాణ కోసం చేసిన త్యాగాలను ఎవరూ రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోలేరని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.

## ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఘనంగా హరీష్ రావు పుట్టినరోజు వేడుకలు




ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అడుగుజాడల్లో ముందుకు సాగుతూ పార్టీని మరింత శక్తివంతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. హరీష్ రావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉదయం ఖమ్మంలోని తెలంగాణ భవన్ లో పార్టీ శ్రేణులు వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, కేసీఆర్ మార్గనిర్దేశనంలో హరీష్ రావు ప్రతినిత్యం పార్టీ కార్యక్రమాలలో తీరిక లేకుండా పాల్గొంటూ "ట్రబుల్ షూటర్"గా పేరొందారని కొనియాడారు. హరీష్‌రావు ఈ విధంగా మరో 50 పుట్టినరోజులు జరుపుకుంటూ ఆయురారోగ్యాలు,సుఖ సంతోషాలతో జీవించాలని ఎంపీ రవిచంద్ర ఆకాంక్షించారు. బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్, మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యులు హరీష్ రావు పుట్టినరోజు వేడుకల్లో ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, పార్టీ నాయకులు ఆర్జేసీ కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు,బిచ్చాల తిరుమలరావు, బచ్చు విజయ్ కుమార్, బొమ్మెర రాంమూర్తి, పగడాల నరేందర్, బెల్లం వేణు తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లె సైదులు మాదిగ



సూర్యాపేట జూన్ 03(విజన్ ఆంధ్ర): సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బొల్లె సైదులు మాదిగకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1న హైదరాబాదులో జరిగిన సమావేశంలో టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ సెల్ విభాగంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట కోసం కృషి చేసినందుకు తనకు ఈ పదవి లభించిందన్నారు. దళితుల కోసం అనేక పోరాటాలు చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు గతంలో దళిత రత్న అవార్డు కూడా అందుకున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. 40 ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాటంలో ఏబిసిడిల వర్గీకరణ చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డికి మాదిగలు కృతజ్ఞతా భావంతో ఉంటారని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు,టి పి సి సి ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణకు,తెలంగాణ టూరిజం అభివృద్ధి కమిటీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సైదులుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

## గుంపెల్ల గూడెంలో ఎక్సైజ్ దాడులు సుమారు రూ 2 లక్షల మద్యం స్వాధీనం



కారేపల్లి,జూన్ 3 (విజన్ ఆంధ్ర): ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు రూ. 2 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీన పరచుకొని అప్పాయి గూడెంలోని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రశాంతి తెలిపారు.వివరాల్లోకి వెళితే కారేపల్లి మండల పరిధిలోని గుప్పెల్ల గూడెం గ్రామంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనపరచుకున్నట్లు ఆమె తెలిపారు.కేసు నమోదు చేసి వివరాలను వెల్లడిస్తామని అన్నారు. కాగా ఇటీవల యదేచ్ఛగా బెల్ట్ షాపులకు మద్యం తరలించడం పై పలు కథనాలు ప్రచురితం అవడంతో ఎక్సైజ్ అధికారులు ఎట్టకేలకు తనిఖీలు ముమ్మరం చేశారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

**గంట వ్యవధిలో 158 ఫోన్ కాల్స్**
**79 మందికి స్వయంగా సమాధానమిచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి హామీ**
**నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల హర్షం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 3 (విజన్ ఆంధ్ర): వనపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి బుధవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రముఖ వార్తా సంస్థ 'వే టు న్యూస్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యక్ష వినతుల కార్యక్రమం అత్యంత విజయవంతంగా సాగింది. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా వివరించారు.

హోరెత్తిన ఫోన్లు..: కేవలం గంట వ్యవధిలోనే ఈ కార్యక్రమానికి ఏకంగా 158 ఫోన్ కాల్స్ వచ్చాయి. సమయాభావం ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే మేఘారెడ్డి అత్యంత ఓపికతో 79 మంది కాలర్లతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన 79 కాల్స్ సమయం ముగియడం వల్ల మిస్డ్ కాల్స్‌గా మిగిలిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలపై నేరుగా చర్చ..: ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా:
- ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల మంజూరు
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
- తాగునీటి ఎద్దడి నివారణ

ప్రజలు సావధానంగా వివరించిన ఈ సమస్యలన్నింటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పనితీరుపై ప్రజా ప్రశంసలు..

"మీరు చాలా బాగా పనిచేస్తున్నారు.. రాబోయే రోజుల్లో కూడా ఎప్పటికీ మీరే మా ఎమ్మెల్యేగా ఉండాలి" అంటూ ఫోన్ చేసిన పలువురు ప్రజలు ఎమ్మెల్యే మేఘారెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. గంట పాటు సాగిన ఈ సుదీర్ఘ కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కానీ, స్థానిక పాలనపై కానీ ఎలాంటి ఫిర్యాదులు రాకపోవడం విశేషం. ఇది ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందిస్తున్న సుపరిపాలనకు, ఆయన నిరంతర శ్రమకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వంతెనలా నిలిచి ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 'వే టు న్యూస్' ప్రతినిధులను, సిబ్బందిని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## కొత్తగూడెం ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 04(విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన ఈ పరిశీలనలో గోడౌన్ భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతా పరిస్థితులు, నిఘా వ్యవస్థ పనితీరును సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ముందుగా గోడౌన్‌కు అమర్చిన సీల్‌ను పరిశీలించిన కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ఎన్నికల శాఖ అధికారుల సమక్షంలో సీల్‌ను తెరిపించి గోడౌన్‌లోకి ప్రవేశించారు. అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన గదులను సందర్శించి వాటి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. తనిఖీ పూర్తైన తర్వాత తిరిగి గోడౌన్‌కు సీల్ వేయించి భద్రతా నిబంధనలను పాటించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించడంతో పాటు అనుమతి లేని వ్యక్తులను లోపలికి అనుమతించరాదని సంబంధిత అధికారులకు, భద్రతా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించిన కలెక్టర్, కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, నిఘా ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. గోడౌన్ పరిసరాల్లో 24 గంటల పర్యవేక్షణ కొనసాగాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ అనంతరం గోడౌన్ తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ అంకిత్ సంతకం చేసి పరిశీలనను ముగించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి లక్ష్మణ్ అగర్వాల్, బీజేపీ నాయకుడు జె. మోహన కృష్ణ, బీఆర్ఎస్ ప్రతినిధి అనుదీప్ ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్, అశోక్, భద్రతా సిబ్బంది మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే లక్ష్యం - జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 03 ( విజన్ ఆంధ్ర ) : ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా 2026 జూన్ 03 బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత సిబ్బంది విధి నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు , కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసులకు-ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల రక్షణ మరియు వారిపై జరిగే నేరాల కేసుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని, పాత నేరస్థుల




కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రాబోయే ప్రతిష్టాత్మక బోనాలు మొహర్రం పండుగలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మక, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ గారు, ఎస్ఐ లు,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమం ప్రారంభం



నిర్మల్ జిల్లా,జూన్ 03,(విజన్ ఆంధ్ర); నిర్మల్ పట్టణంలోని 1 వ వార్డు గాంధీనగర్ కాలనీలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణి కార్యక్రమాన్ని నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి గారు,స్థానిక కౌన్సిలర్ కత్తి నరేందర్ గారు ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కత్తి నరేందర్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మెప్మా ఆర్పీలు రమ , శ్రీవాణి , వార్డ్ ఆఫీసర్ రాజు ,మరియు నాయకులు మదిరే లింగన్న,మొగిలి రాజేష్, బొమ్మెడ రాజేష్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## హెచ్ వీ పి వ్యాక్సినేషన్ ద్వారా ప్రమాదకర కాన్సర్ ను నిర్ములించవచ్చు

**జూలూరుపాడు పి హెచ్ సీ వైద్యులు డా వెంకటేశ్వర్లు**







జూలూరుపాడు మండలం జూన్ 4 (విజన్ఆంధ్ర): జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ లో 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరం ఆడపిల్లలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ ప్రారంభించారు.ఇందు లో భాగంగా 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు నడుస్తున్నటువంటి బాలికలుకు హెచ్ పి వి వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. జూలూరుపాడు మండలం లో సుమారుగా 155 మంది బాలికలు 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు నడుస్తున్నటువంటి బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిను ఇది నిరంతర ప్రక్రియ ఆదివారం తప్ప మిగతా రోజులన్నీ కూడా ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇవ్వడం జరుగుతుంది. హెచ్ పి వీ వ్యాక్సిన్ ఇవ్వడం వలన మహిళల్లో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నివారణ వజినల్ మరియు ఉల్వర్ క్యాన్సర్ల నివారణ పురుషులు మరియు మహిళల్లో మల ద్వారా అనాల్ క్యాన్సర్ నివారణ జననేంద్రియ మొటిమలు జనైటెల్ వర్ట్స్ నివారణ రాకుండా నివారించడానికి ఉపయోగిస్తారు.మండల ప్రజలు ఈ అవకాశన్ని ఉపయోగించుకోవాలి అని జూలూరుపాడు మండల వైద్య అధికారి డా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వైద్య అధికారి డా వెనకాశ్వర్లు ఆయుష్ మెడికల్ ఆఫీసర్ హెల్త్ సూపర్ వైజార్ రత్న కుమార్ హెచ్ వి రాధిక ప్రియదర్శిని ఫార్మసిస్ట్ శశికళ ఏఎన్ఎం ఆదిలక్ష్మి ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మల్కాజిగిరి, జూన్ 3, (విజన్ ఆంధ్ర): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 2 వ తేదీ అర్ధరాత్రి సుమారు 00:30 గంటల సమయంలో మౌలాలి ఫ్లైఓవర్ పైన మౌలాలి నుండి తార్నాక వైపు వెళ్తున్న ఓ గుర్తుతెలియని వాహనం సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో అతను తీవ్ర గాయాల పాలయ్యాడు. అనంతరం బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతుతూ అక్కడే మరణించాడు. ఇతను మౌలా-అలీ ఫ్లై ఓవర్ మీద ఉంటూ భిక్షాట చేసుకుని జీవించే వాడని సమాచారం. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే వెంటనే మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌ను ఫోన్ నెంబర్ 8712662691, 8712662141 సంప్రదించాలని పోలీసులు కోరారు.

## డిభిసీడీవో గా బాధ్యతలు స్వీకరించిన పి. నర్సయ్య

కామారెడ్డి బ్యూరో జున్ 3(విజన్ఆంధ్ర): కామారెడ్డి జిల్లా డిభిసీడీవో గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన పి.నర్సయ్య జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు.



# పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

**రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపద పెంపే లక్ష్యం**
**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం, పర్యావరణ వారోత్సవాలు**
**సైక్లింగ్ చేసి అవగాహన కల్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 3 (విజన్ ఆంధ్ర): ప్రజలందరికీ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎకో పార్కులో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు', 'ప్రపంచ సైకిల్ దినోత్సవం' పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి జెండా ఊపి ఈ సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు.

ఐదు కిలోమీటర్లు సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే, కలెక్టర్




ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్థానికులతో కలిసి ఎకో పార్కులో ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ చేశారు. స్వయంగా సైకిల్ తొక్కుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. అనంతరం పార్కులోని సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను సందర్శించడంతో పాటు, అటవీ శాఖ పరిధిలో నిర్మించిన చెక్ డాంలు, కుంటలను వారు పరిశీలించారు.

చెట్లే ప్రాణాధారం: ఎమ్మెల్యే మేఘారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అడవుల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని, అడవుల పెంపకంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పిస్తామని చెప్పారు.



జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని పెంచుతాం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఎకో పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు, మొక్కల పెంపకంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.


చిత్ర ప్రదర్శన పరిశీలన: ఈ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు చిత్ర ప్రదర్శన (ఫొటో ఎగ్జిబిషన్) ద్వారా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, డిపిఆర్ఓ సీతారాం, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల పూడిక తీత పనులు ప్రారంభించాలి : తోట లక్ష్మీకాంతరెడ్డి



అల్వాల్, జూన్ 3,(విజన్ ఆంధ్ర): చెరువులను పూడిక తీత పనులు తక్షణమే మొదలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు శేఖర్ తో కలిసి అల్వాల్ లోని పలు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్వాల్ సర్కిల్ లోని కొత్తచెరువు, చిన్న రాయుడు చెరువులను పూడిక తీసి సుందరీకరణ చేపట్టాలని అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువుల పూడిక తీత పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని తోట లక్ష్మీకాంతరెడ్డి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, మల్లెల శివ, భాస్కర్, ఉదయ్, రాజేందర్ యాదవ్, భబిత, జ్యోతి యాదవ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు

## స్పెక్ట్రా విజన్ షోరూమ్‌ను ప్రారంభించిన మత పెద్దలు..



సూర్యాపేట జూన్ 03(విజన్ఆంధ్ర): సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్ ఐఆర్ఏ ఆసుపత్రి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హనియాస్ స్పెక్ట్రా విజన్ కంటి అద్దాల,నేత్ర సంరక్షణ కేంద్రాన్ని బుధవారం మౌలానా అత్తర్ సాబ్, మౌలానా అమర్ అబి సాబ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన నేత్ర సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ఆధునిక కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు, నాణ్యమైన లెన్స్‌లు, స్టైలిష్ ఫ్రేమ్‌లు, హోమ్ డెలివరీ సేవలు వంటి సౌకర్యాలతో ఈ కేంద్రం ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. వ్యాపార సంస్థ అభివృద్ధి చెందుతూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలీం, సిద్ధిక్, బషీర్ రెహమాన్, రహమాన్ మౌలానా, భాషిత్ మౌలానా, ఆసిఫ్, నిర్వహకులు సయ్యద్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

**ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలి**

**అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 04(విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామాలు వార్డుల స్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాలను నాలుగు క్లస్టర్లుగా, మున్సిపాలిటీల పరిధిలోని వార్డులను కూడా క్లస్టర్లుగా విభజించి ప్రణాళికాబద్ధంగా సభలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజలకు వానాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, అంటువ్యాధుల నివారణ, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, చెరువులు మరియు



ఇతర జల వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటకం, వాటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి విధానం, ఎరువుల సమతుల వినియోగం, ఫార్మర్ రిజిస్ట్రేషన్, వానాకాల సాగుకు సంబంధించిన సూచనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా జనగణన కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సేవలు, ప్రభుత్వ పథకాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సభల్లో విస్తృతంగా వివరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ముందస్తు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు సభలకు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, సభల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రామ, వార్డు సభలను సమర్థవంతమైన వేదికలుగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

## జూన్ 07న రామోజీ ఫిల్మ్ సిటీలో టీజీ-20 లీగ్ వేలం




హైదరాబాద్, జూన్ 03 (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక టీజీ20 లీగ్ ప్లేయర్ల వేలం జూన్ 7న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హెచ్‌సీఏలో నమోదైన 1,300 మందికి పైగా క్రికెటర్లు వేలంలో పాల్గొననుండగా, భారత స్టార్ ఆటగాళ్లు మహమ్మద్ సిరాజ్, తిలక్ వర్మ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని తెలిపారు. ఈ లీగ్‌లో 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొనగా ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జూన్ 21 నుంచి 32 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి జట్టుకు రూ.60 లక్షల పర్స్ కేటాయించగా గరిష్టంగా 20 మంది ఆటగాళ్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి జట్టులో కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను చేర్చడం తప్పనిసరి చేశారని తెలిపారు. వేలం ప్రక్రియను ప్రముఖ ఆక్షనీర్ చారు శర్మ నిర్వహించనుండగా జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుందని తెలిపారు.

## కొత్తగూడెంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మానం



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 04 (విజన్ ఆంధ్ర): గిరిజన ప్రాంత విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో భద్రాద్రి గిరిజన విద్యా కళాశాల పూర్వ విద్యార్థుల ఫోరం ఆధ్వర్యంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన పట్టభద్రుల సంక్షేమార్థం 2000 సంవత్సరంలో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్థాపించబడిన గిరిజన విద్యా కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడి సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న తారాచంద్, మోహన్‌రావు, శంకర్, నరేష్‌బాబు, నరసింహారావు, శ్రీనివాస్ కబీర్‌దాస్, నరేంద్రబాబు, మోహన్ తదితరులు ఒక ఫోరంగా ఏర్పడి విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాత కొత్తగూడెంకు చెందిన ఎం.డి. జైనాబ్ (556/600), ఆనందఖనికి చెందిన ఎం. ప్రత్యూష (545/600), పి. శ్రీలేఖ (537/600)లను వారి తల్లిదండ్రులతో కలిసి ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ అంజద్ పాషా, శంకర్‌రావు తదితరులు, గిరిజన బీఈడీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదయాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నగదు పురస్కారాలు, ఫైల్స్, రాతపుస్తకాలు, పెన్నులు, స్వీట్లు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ అంజద్ పాషా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరెందరో విద్యార్థులకు స్ఫూర్తినివ్వవచ్చని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల ఫోరం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదయాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏ ప్రాంతాల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు ఇదే తరహాలో విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు రావాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందించేందుకు, విద్యా ప్రగతికి దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛందంగా నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమాన్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ మిత్రబృందం, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి..




సూర్యాపేట జూన్ 03 (విజన్ ఆంధ్ర): నాణ్యమైన ఆహార పదార్థాలు, మెరుగైన సేవలతో వినియోగదారుల మన్ననలు పొందాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల స్వగృహ ఫుడ్స్ దుకాణాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను కోరుకుంటున్నారని, అలాంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపార సంస్థలు సేవలు అందించాలని సూచించారు. తిరుమల స్వగృహ ఫుడ్స్ యాజమాన్యం నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు కంది బండ నాగరాజు, మామిడాల కళాధర్ మాట్లాడుతూ,తమ సంస్థకు ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో 30 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. స్థానికంగా మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు సైతం తమ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలు, ఇతర ఫంక్షన్ల కోసం ఆకర్షణీయమైన డెకరేషన్‌తో ప్రత్యేక స్వీట్స్ బుట్టలను తయారు చేసి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గుణగంటి హేమ సతీష్, గందూరి పావని కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కౌకూర్‌లో నాలా డీసిల్టింగ్ పనులు ప్రారంభం



అల్వాల్, జూన్ 3, (విజన్ ఆంధ్ర): కౌకూర్‌లోని హరిజన్ బస్తీ, ఇందిరా కాలనీ, సంజయ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో బుధవారం ఓపెన్ నాలా డీసిల్టింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలు మేరకు ఈ పనులు ప్రారంభమైనాయని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతాల ప్రజలతో పాటు విల్లా ఆర్కిడ్స్, జనప్రియ ఆర్కేడియా నివాసితులు డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి నిల్వలు, దుర్వాసన వంటి ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను తాను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజల తరపున నిరంతరం కృషి చేయడంతో యాప్రాల్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులు నాలా శుభ్రపరిచే పనులను చేపట్టారని ఆయన తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నాలా డీసిల్టింగ్ పనుల ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద ముప్పు తగ్గడంతో పాటు మురుగు నీటి ప్రవాహం మెరుగు పడుతుందన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కా రానికి బాక్స్ డ్రెయిన్ లేదా ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన, యాప్రాల్ డివిజన్ ఇంజనీరింగ్ విభాగం డీఈ పద్మలత, ఏఈ సత్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ లకు, సంబంధిత సిబ్బందికి తుడిమెల్ల మల్లికార్జున్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాప్రాల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శివరాజ్, సయ్యద్ అస్లాం, కౌశల్ యాదవ్ , రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు అప్రమత్తత.. రెస్క్యూ బృందాలకు ఎస్పీ కీలక ఆదేశాలు



కొత్తగూడెం బ్యూరో జూన్ 04( విజన్ ఆంధ్ర): రాబోయే వర్షాకాలం నేపథ్యంలో విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వరదలు, ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌డీఆర్ఎఫ్, డిడిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీం మరియు అగ్నిమాపక శాఖ అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. వర్షాకాలంలో ముంపు ముప్పు అధికంగా ఉండే లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత గ్రామాలను ముందుగానే గుర్తించి, అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా రక్షక బృందాలను ముంపు ప్రాంతాల సమీపంలో ముందస్తుగా మోహరించాలని సూచించారు. పోలీసు శాఖతో పాటు ఎస్‌డీఆర్ఎఫ్, డిడిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీం, అగ్నిమాపక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. రక్షణ చర్యలకు అవసరమైన బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్లు, చెట్లు తొలగించేందుకు ఉపయోగించే కట్టర్లు తదితర అత్యవసర సామగ్రిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, ప్రమాద సూచనలను విస్తృతంగా తెలియజేయడం, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి క్రాంతి కుమార్, టీజీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, ఆపరేషన్ ఆర్ఐ బి.రవి, సింగరేణి రెస్క్యూ టీం ఇన్‌చార్జ్ అనంత రాములు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు సుమంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

## టీపీసీసీ ఎస్సీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాణాల వెంకన్న నియామకం



సూర్యాపేట జూన్ 03:(విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట మండలం ఇమాంపేటకు చెందిన బాణాల వెంకన్నను నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారని బుధవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఈ మేరకు జూన్ 1 తేదీన విడుదల చేసిన ఉత్తర్వుల నియామక పత్రాన్ని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కల్వంపల్లి సత్యనారాయణ ,టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా వెంకన్న అందుకున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలను అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో టీపీసీసీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెంకన్న కీలక పాత్ర పోషిస్తారని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తూ ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.


## 49 వ డివిజన్ లో చీరల పంపిణి చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 03.కరీంనగర్ నగరపాలక సంస్థ49 డివిజన్ కార్పోరేటర్ అన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా బుధవారం రోజు న మన సనాతన ధర్మం సేవా సమితి డివిజన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరల పంపిణి కార్యక్రమం జరిగింది. 49వ డివిజన్లో ఓటు హక్కు , ఆధార్ కార్డు రేషన్ కార్డు ఉండి దారిద్ర రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదవారికి ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ తో , ఆర్ పి గాయత్రి, వార్డ్ ఆఫీసర్ మెండే శిరీష, డివిజన్ ప్రజలు విజయలక్ష్మి శారద ,మమత, కవిత, సులోచన సౌజన్య ,స్వరూప ,లావణ్య తో పాటు బిజెపి కార్యకర్తలు లంబు సుధాకర్ రెడ్డి గాదగోని రమేష్ భూమ్ రావు, నల్మచు సంతోష్ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**
**టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు**
**పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి**
**యూరియా పక్కదారి పడితే సహించేది లేదు**





వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 3 (విజన్ ఆంధ్ర): వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన 'టాస్క్ ఫోర్స్ కమిటీ' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ఆకస్మిక తనిఖీలు చేపట్టండి : ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వానకాలం సీజన్ ముంగిట రైతులు సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో నకిలీ విత్తనాల ముఠాలు రంగంలోకి దిగే ప్రమాదం ఉందన్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులు జిల్లావ్యాప్తంగా నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు గుర్తిస్తే, బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దొడ్డు రకం వద్దు.. సన్న రకమే ముద్దు!

రైతులకు పంట మార్పిడి విధానాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఒకవేళ రైతులు కేవలం వరి సాగు చేయడానికే మొగ్గు చూపినట్లయితే, వారిని కేవలం సన్న రకం వరి ధాన్యాన్ని మాత్రమే వేసేలా ప్రోత్సహించాలని, దొడ్డు రకం వరి ధాన్యాన్ని వేయకుండా చూడాలని స్పష్టం చేశారు.

ముఖ్యంగా కొన్ని మండలాల్లో రైతులు 'దాన్ 75' రకం వరి ధాన్యాన్ని ఎక్కువగా వేస్తున్నారని కలెక్టర్ ప్రస్తావించారు. ఈ రకం వరిని మార్కెట్లో ఎవరూ కొనుగోలు చేయడం లేదని, దీనివల్ల భవిష్యత్తులో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే 'దాన్ 75' రకం వేయవద్దంటూ వారికి అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

యూరియా వినియోగంపై ప్రత్యేక నిఘా : ఇక జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా, పక్కదారి పట్టకుండా కఠిన నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. గత సీజన్లలో అత్యధిక మొత్తంలో యూరియా కొనుగోలు చేసిన వారిని ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. వారు నిజంగానే పంటల కోసం యూరియా వాడుతున్నారా? లేదా ఇతర అవసరాలకు పక్కదారి పట్టిస్తున్నారా? అనే అంశంపై క్షేత్రస్థాయిలో ఆరా తీసి, తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

హాజరైన అధికారులు : ఈ ఉన్నత స్థాయి సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, తహసిల్దార్లు, ఎస్సైలు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఉత్కంఠ భరితంగా సెయిలింగ్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, జూన్ 03 (విజన్ ఆంధ్ర) : మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ రెండో రోజు పోటీలు హుస్సేన్ సాగర్ లో ఉత్కంఠ భరితంగా సాగాయి. భారీ ఈదురు గాలుల మధ్య జరిగిన రేసుల్లో ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్‌లో చంద్రలేఖ తట్టారి–ధనుష్ జక్కుల జోడీ వరుసగా రెండు రేసుల్లో విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచింది. బద్రీనాథ్ నిరుడు–రిశ్వంత సుంచనకోట ద్వయం రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఇఆర్ విభాగంలో వినోద్ దండు–అరవింద్ మాలోత్ జోడీ మూడు రేసుల్లో రెండింటిని గెలిచి పట్టికలో ముందంజలో ఉంది. ఐఎల్‌సీఏ4 అండర్–18 బాలుర విభాగంలో ప్రీత్ సివాల్ తొలి స్థానంలో నిలవగా, బాలికల విభాగంలో కాత్యాయని కౌశిక్ ఆధిక్యాన్ని కొనసాగించింది. ఇదిలా ఉండగా, టాప్ సీడ్ సెయిలర్ దీక్షిత కొమరవెల్లి బోటు తిరగబడటంతో భుజానికి గాయమై టోర్నమెంట్ నుంచి తప్పుకుంది.

## విద్యాశాఖ కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జూన్ 3 (విజన్ఆంధ్ర): బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్స్ ఎడ్యుకేషనల్ సెక్రెటరీ, అభినవ్ అభిలాష విద్యా శాఖ సెక్రటరీ యోగితారాణా , డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలిన్, హయ్యర్ ఎడ్యుకేషన్ దేవసేన అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా విద్యాశాఖ అధికారి , జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి లతో కలసి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" ప్రవేశాల ప్రత్యేక కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు మోడల్ స్కూళ్లలో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. భవిత కేంద్రాల బలోపేతం, కొత్త ప్రీ–ప్రైమరీ విభాగాల ప్రారంభం, జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల పునఃప్రారంభం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, వంటి వేదికల వినియోగాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సకాలంలో పంపిణీ చేయడంతో పాటు, సెర్ప్ బృందాల ద్వారా యూనిఫార్ముల కుట్టింపు ,పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో విద్యా కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణతో పాటు రోజువారీ పురోగతి సమీక్ష నిర్వహించాలని సమావేశంలో సూచించారు.

## గ్రామసభల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలి

**వడదెబ్బ మరణాల ఎక్స్‌గ్రేషియా, ఎన్ఎఫ్‌బీఎస్ పథకాలపై ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలి**
**కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్–03(విజన్ ఆంధ్ర): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహించనున్న గ్రామసభలు, వార్డు సభలను విజయవంతం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ. వడదెబ్బతో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తోందని, ఇందుకు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరి అని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హ కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం లభిస్తుందని చెప్పారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో జరిగే గ్రామసభల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి నిర్వహణ, ఆరోగ్య జాగ్రత్తలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులకు దశలవారీ పంట ప్రణాళికలు వివరించాలని వ్యవసాయ శాఖకు ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మలేరియా డెంగ్యూ నివారణ చర్యలు, చెరువుల కట్టల బలోపేతం, కాలువల పూడికతీత పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఏసీపి గోదావరిఖని రమేష్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మియాపూర్ సర్కిల్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్ శేరిలింగంపల్లి నారాయణ్ అమిత్ ఐఏఎస్



శేరిలింగంపల్లి.జూన్ 3 (విజన్ ఆంధ్ర): జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఈరోజు మియాపూర్ సర్కిల్ పరిధిలోని పెద్ద కుడి చెరువు, పటేల్ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి వెంబడి, మియాపూర్ సర్కిల్‌లోని వివిధ కాలనీలలో వర్షపు నీరు నిలిచిపోతున్న ప్రాంతాలను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, డ్రైనేజీ మెరుగుదల పనులను వేగవంతం చేయాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. చెరువుల అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంట ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

## జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్03(విజన్ ఆంధ్ర) ; మడికొండలోని మహిళా ప్రాంగణంలో డీఆర్‌డీఏ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సాధికారతకు తోడ్పాటుగా 1 కోటి 50 లక్షల తో నిర్మించనున్న జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా యజమానులుగా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి తీసుకెళ్తోందన్నారు. మహిళలకు అవకాశం కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని, ఇంటిని చక్కదిద్దే మహిళకు అవకాశం ఇస్తే వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగం ఇలా అన్ని రంగాల్లోనూ తన ప్రతిభను చాటగలరని పేర్కొన్నారు. మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని, ఇకపై "మడికొండలో మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఉంది" అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సోలార్ రంగం వంటి అనేక రంగాల్లో మహిళలు విజయవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలను నాయకత్వ స్థానాల్లో నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ఆదాయ వనరులు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించబడనున్న ఈ పెట్రోల్ బంక్ మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడమే కాకుండా, మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకలాంటివారని, వారు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు. అందుకే మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇస్తూ, మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, డిఇఓ శ్రీనివాస్, బిపిసిఎల్ ఎండి సుధీర్, ముఖ్య నాయకులు, ఐకేపీ రీజినల్ కోఆర్డినేటర్లు, సీసీలు మరియు స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాల నివారణకు ముందస్తు చర్యలు

**-సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ సృజన సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన**



శేరిలింగంపల్లి,జూన్ 3 :(విజన్ ఆంధ్ర): వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై వరద నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, మునిసిపల్ కమిషనర్ సృజనతో కలిసి సైబరాబాద్ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను పరిశీలించారు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిస్థితులను సమీక్షించి అవసరమైన చర్యలపై సూచనలు చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మల్కం చెరువు బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ వద్ద భారీ వర్షాల సమయంలో రోడ్లపై వరద నీరు చేరుతున్న ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూం జంక్షన్ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసులు, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ట్రాఫిక్ అంతరాయాలు నివారించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డీసీపీ రిత్‌రాజ్, ఏడీసీపీ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న "అభ్యుదయ కళాసమితి " తెలంగాణ అవతరణ దినోత్సవం సంబరాలు




హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ ఆధ్యాత్మిక,సాంస్కృతిక, సేవా సంస్థ "అభ్యుదయ కళాసమితి" అధ్యక్షుడు నారాయణం భాస్కర శర్మ సమర్పణలో నిర్వహించిన తెలంగాణ అవతరణ దినోత్సవ సంబరాలు – 2026 కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది , అలరించింది, తెలంగాణ స్ఫూర్తిని అందించింది. మంగళవారం సాయంత్రం రవీంద్రభారతి మొదటి అంతస్తు సమావేశ మందిరం, సైఫాబాద్, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంప్రదాయ కళాప్రదర్శనలు నృత్య, రంగస్థల, భక్తి సంగీతం కళాకారుల కార్యక్రమాలు శ్రవణానందకరంగా, నేత్రపర్వంగా, అద్భుతంగా నిర్వహించారు. ఈ తెలంగాణ అవతరణ దినోత్సవ సంబరాల కార్యక్రమానికి టి. రామచంద్రరావు , వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానిత అతిథులుగా, 1969 ఉద్యమకారుల రాష్ట్ర సంఘ అధ్యక్షులు డాక్టర్. చక్రహరి రామరాజు, హైకోర్టు అడ్వకేట్ తెలంగాణ ఉద్యమనాయకుడు కె. కరుణాసాగర్, తెలంగాణ ఉద్యమకారుడు ఫోరం రాష్ట్ర టి.యు.ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనిగె విష్ణువర్ధన్, తెలంగాణ రాష్ట్ర అమరవీరుల సంఘ కార్యవర్గ సభ్యురాలు, స్వర్గీయ శ్రీకాంతాచారి మాతృమూర్తి కాశోజు శంకరమ్మ , సీనియర్ తొలి ఉద్యమనాయకుడు డి. సుదర్శన్ రావు, శ్రీవిద్యా శక్తిపీఠం, శ్రీవిద్యోపాసకుడు బ్రహ్మశ్రీ నారాయణం చక్రవర్తి శర్మ పాల్గొని తెలంగాణ ఉద్యమకారులు, అమరవీల కుటుంబాలకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ సంధర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు నారాయణం భాస్కర శర్మ అతిథులకు తెలంగాణ అవతరణ దినోత్సవ పురస్కారాలను ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలలో భాగంగా, గురువు టి. పద్మలత, లయ డాన్స్ అకాడమీ శిష్యబృందంచే భరతనాట్యం ప్రదర్శన, గురువు రజని చకిలం, నృత్యంజలి డ్యాన్స్ అకాడమి శిష్య బృందంచే కూచిపూడి నృత్యం, అభ్యుదయ కళాసమితి కళాకారులచే, ఎన్. భాస్కర శర్మ బృందం, డాక్టర్. ఏడిద బాలసుబ్రహ్మణ్య శర్మ బృందంచే భక్తి సంగీతం కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి, సంగీత సాగరంలో మైమరపింపజేశాయి. అలాగే ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్, నంది అవార్డు గ్రహీత, బాపనపల్లి వెంకట స్వామి అద్భుతంగా ప్రదర్శించి, మెప్పించిన 'రావణబ్రహ్మ' ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఎంతగానో ప్రభావితం చేస్తూ ఉత్తేజపరిచింది. కార్యక్రమంలో నాయకులు, ఉద్యమకారులు, సంగీత ప్రియులు, కళాభిమానులు, తెలంగాణ వాదులు, న్యాయవాదులు, పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు. చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కార్యక్రమ నిర్వాహకుడు "అభ్యుదయ కళాసమితి" అధ్యక్షుడు నారాయణం భాస్కర శర్మ బృందాని అభినందించి, ప్రశంశలు అందజేశారు.

## హిమాయత్నగర్ లో "కెప్టెన్ కునాఫా గ్లోబుల్ డెజర్ట్ కేఫ్" ఘనంగా ప్రారంభం




హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ఒక పెద్ద 'కేఫ్' లా కాకుండా, వినూత్నమైన అభిరుచితో ఒక సాదాసీదా ఇంట్లో ప్రారంభమైన "కెప్టెన్ కునాఫా" ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిపూర్ణతను సాధించి,గొప్ప బ్రాండ్ గా పేరు సంపాదించుకుని తన రుచిని నమ్మిన ప్రజల ప్రేమతో ముందుకు సాగుతూ, ఒక చిన్న ఆన్‌లైన్ ప్రయాణంగా మొదలైన "కెప్టెన్ కునాఫా" తక్కువ కాలంలోనే గొప్ప నమ్మకాన్ని సంపాదించుకొని, క్వాలిటీని మెయింటెన్ చేస్తూ ఎదుగుతూ నగరంలోని హిమాయత్నగర్ లో మంగళవారంనాడు తమ 11 వ బ్రాంచ్ (కెప్టెన్ కునాఫా – గ్లోబుల్ డెజర్ట్ కేఫ్) ను ఘనంగా ప్రారంభించింది. నోరూరించే రుచులతో, స్వచ్ఛమైన పదార్థాలు, సాటిలేని తాజాదనంతో తాము అందించే వంటకాలు కూడా పెరిగాయని, 'కెప్టెన్ కునాఫా' మెనూలో రుచికరమైన మిల్క్‌కేక్‌లు, మృదువైన చీజ్‌కేక్‌లు, క్లాసిక్ టి, మోక్ టేల్స్ వంటివి చేర్చబడ్డాయని కెప్టెన్ కునాఫా ఫౌండర్ చైర్మన్ 'బిన్ సయీద్ షామ్లాన్ సౌద్ అల్ ఖులాకీ' ఈ సందర్భంగా తెలిపారు. దీనిలో ప్రతి ఒక్కటీ అంతే శ్రద్ధతో, నాణ్యతపై అంతే అంకితభావంతో తయారు చేయబడతాయని తెలిపారు. ఒక అవుట్‌లెట్ నుండి అనేక అవుట్‌లెట్‌లకు విస్తరిస్తూ, 'కెప్టెన్ కునాఫా' అతి త్వరలోనే హైదరాబాద్ నగరంలో మరో 4 కొత్త బ్రాంచెస్ తో తన ఉనికిని చాటుకోబోతోందని తెలిపారు. ఈ హిమాయత్నగర్ అవుట్ లెట్ లో ప్రీమియం డెజర్ట్‌లను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువస్తున్న ప్రయాణం తమని ఇప్పటివరకు ఆదరిస్తున్న తమ కస్టమర్లు అతిపెద్ద మైలురాయి అయిన మా ఈ 'కెప్టెన్ కునాఫా గ్లోబుల్ డెజర్ట్ కేఫ్ ' ను ఆదరిస్తారని తెలుపుతూ, ఇక్కడ డెజర్ట్‌లు కాంటినెంటల్ రుచులతో, చేతితో తయారు చేసిన కాఫీలతో, ర్యాప్‌లతో మరెన్నో వాటితో ఇప్పుడు 'కెప్టెన్ కునాఫా గ్లోబుల్ డెజర్ట్ కేఫ్' ఒక గొప్ప గమ్యస్థానంగా మారనున్నదని తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో హిమాయత్నగర్ బ్రాంచ్ 'కెప్టెన్ కునాఫా గ్లోబుల్ డెజర్ట్ కేఫ్' ఫ్రాంచైసీ పార్ట్నర్లు హబీబ్ మొహమ్మద్, బిన్ జమాల్ ఉల్లాల్ అహ్మద్ బంధుమిత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా**
**నానో యూరియా వినియోగంపై లకు విస్తృత అవగాహన కల్పించాలి**
**పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు**




ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 3(విజన్ ఆంధ్ర): వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్–అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధార పడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

**శిక్షణ పొందిన బెల్ట్ లు ప్రధానం చేసిన రాష్ట్ర బిజెపి నేత నామాజీ**



నారాయణపేట, జూన్ 3 ( విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరికి కరాటే ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. బుధ వారంకేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ లు సర్టిఫి కెట్స్ పంపిణీ చేశారు.ముందుగా బ్లాక్ బెల్ట్ సాధించిన స్రవంతి, భావేష్, నాయుడు.యం.అఖిల్. శివ శంకర్. అభిరామ్. లావణ్య. రిత్విక్. అర్జున్.లకు బ్లాక్ బెల్ట్ లు సర్టిఫికెట్‌లను అందించారు. అనంతరం నామాజీ మాట్లాడుతు మాట్లాడుతూ విద్యార్థులందరూ కన్న తల్లిదండ్రుల పట్ల గౌరవంతో ఉండాలని. గురువులను పూజించాలని. సమాజం పట్ల ఎంతో బాధ్యతతో మెలగాలని సమాజంలో ఒకరికొకరు స్నేహభావంతో నడుచుకోవాలని సూచించా రు..మాస్టర్ అశోక్ కు మీ కరాటే అకాడమీ నుండి మంది విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇచ్చి సమాజానికి అందించాలని అన్నారు.ఇప్పుడు చదువు నేర్చుకుంటు న్న విద్యార్థులదరు ప్రతి ఒక్కరు విధిగా ప్రతి రోజు యోగ,రన్నింగ్, కసరత్తులు చేయాలని ఈ ఆధునిక కాలంలో ముఖ్యంగా మహిళ లకు కరాటేలో శిక్షణ తప్ప కుండా పొందాలని అప్పుడే మీరందరూ ఆపద సమయంలో మిమ్మల్ని మీరు రక్షించుకునే వారు అవు తారని.అన్నారు.క్రమ శిక్షణ కలిగిన విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా మెలుగుతారు అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్య రఘుపాల్ రెడ్డి. రవి కుమార్ గౌడ్, మాస్టర్ అను రాధ, షి టీమ్ పోలీస్ అధి కారి బాల్ రాజు. రాకేష్ మాస్టర్. పేరెంట్ అశోక్, విద్యార్థులు,నర్సింహ. అమూల్య.ముకుందా. హరిప్రియ. రాకేష్. ఆనంద్. బృందా.అభిలాష్.మహేశ్వరి.సాత్విక్.తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ గీతను అభినందించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు

**వైద్యులు దైవ సమానులు....**



నారాయణపేట, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : సమాజంలో పేదలకు మెరుగైన వైద్య సేవాలు అందించాలి.కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ ను ఏర్పాటు చేయడం అభినంద నీయమని పార్టీ కోసం తమ సమయాన్ని కేటాయించడం డాక్టర్ల నిబద్ధతకు నిదర్శనమని సమాజంలోని పేద ప్రజలకు వైద్య సేవా లు అందించేందుకు నిష్ణాతులైన వైద్యులను జిల్లాల వారిగా చేర్మెన్ లను నియమించడం గర్వకారణమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు, హైదరాబాద్ గాంధీభవన్ లొ నిర్వహించిన డాక్టర్ సెల్ సమావేశంలొ అయన మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెత్రుత్వంలో వైద్యం విద్య వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాదాన్యమిస్తుందని 6లక్షల కోట్ల అప్పులు ఉన్న రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కెళ్లుతుందో న్నారు డాక్టర్ సెల్ ఆధ్వర్యంలో తమ తమ జిల్లా లోని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి వైద్యసేవాలు అందించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు ఈసం దర్బంగా పేట జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలుగా నియమితులైన డాక్టర్ గీతకు పూల బొకే నందించి అభినందించారు.

## ఏపీఐఐసి కాలనీ పార్క్ లో మొక్కలు నాటిన అధికారులు



మల్కాజిగిరి, జూన్ 3,(విజన్ ఆంధ్ర) : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా 90 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మౌలాలి సర్కిల్ పరిధిలోని ఏపీఐఐసి కాలనీ పార్క్ లో అధికారులు మొక్కలు నాటారు. యుబిడి డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ ఈ కార్యక్రమంలో పాల్గొని జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను వెతికి, పార్కులలో మొక్కలు నాటడం జరిగిం దని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ కాలనీలలోని పార్క్ లు, రహదారుల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుబీ డీ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, యుబిడి సిబ్బంది, పారిశుధ్య కార్మికులు వెంకటేష్, రవీందర్, రాజు, ఏపిఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## మాగనూరు మండలానికి రేపు ముఖ్యమంత్రి రాక

మాగనూరు మండలం జూన్ 5 (విజన్ ఆంధ్ర): రేపు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు మాగనూరు మండలం కోల్వూర్ దగ్గర మినీ జూర్యాల ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం విచ్చేస్తున్న సందర్భంగా ఏరియల్ సర్వే హెలికాప్టర్ ద్వారా విచ్చేస్తున్నందుకు కోల్వూర్ నది పరివాహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్అలాగే ముఖ్య నాయకులు . వివిధ శాఖల అధికారులు

# నిఘానేత్రాల పర్యవేక్షణలో పెద్దపల్లి పట్టణం

**-మహిళా పోలీస్ స్టేషన్‌తో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయి**
**- ప్రజల సహకారంతో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తాం**
**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే-03(విజన్ ఆంధ్ర): పెద్దపల్లి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘానేత్రాలు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ భద్రతను మరింత బలోపేతం చేస్తున్నాయి అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం కొత్తగా ఏర్పాటు చేసిన 65 సీసీ కెమెరాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఇప్పటికే ఉన్న 70 కెమెరాలకు అదనంగా వీటిని ఏర్పాటు చేయడంతో పట్టణం మొత్తం నిఘా వ్యవస్థ పరిధిలోకి వచ్చింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు తర్వాత మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, దొంగతనాల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రజలు కూడా తమ నివాసాలు, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పట్టణంలోకి వచ్చే, వెళ్లే కదలికలను పర్యవేక్షించడం వల్ల భద్రత మరింత మెరుగుపడిందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ,మున్సిపల్ చైర్మన్,మున్సిపల్ కమిషనర్,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐలు లక్ష్మణరావు,నరేష్, ప్రజాప్రతినిధులు, ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సహకారంతో అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వం

**తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



విజన్ ఆంధ్ర(03)హైదరాబాద్ : రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతి పదికగా ప్రజలందరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు, బుధవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రణాళికా బద్ధమైన విధానాలు, ఆర్థిక క్రమ శిక్షణతో ప్రజల సహకారాన్ని పొందుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు, మార్చి 6నుంచి జూన్12 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత, రైతు సంక్షేమం, విద్య, ఉపాధి, యువత క్రీడలు, మహిళా శిశు సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నట్లు చెప్పారు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు, మహిళల పాలిట వరం మహాలక్ష్మి పథకం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు, మహిళల ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు, మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులను అందించడం ద్వారా మహిళలకు ఆదాయ వనరులు కల్పిస్తున్నట్లు వివరించారు, 500కే వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల భారం పేద కుటుంబాలపై పడకుండా మహాలక్ష్మి పథకం కింద కేవలం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తు న్నట్లు తెలిపారు, ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందు తున్నాయని, మహిళా సంఘాల బలో పేతానికి చర్యలు, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు, కుసుమ్ ప్రాజెక్టు ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చికిత్సల పరిమితిని 5లక్షల నుంచి 10లక్షలకు పెంచినట్లు వెల్లడించారు, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా ప్రభుత్వం సాధిస్తున్న విజయాలకు ఇవి కొన్ని ఉదాహరణలని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు

# ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే గుండె వాల్వ్ మార్పిడి వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 3 ( విజన్ ఆంధ్ర ): గుండె వైద్యరంగంలో వరంగల్ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ కార్డియాలజీ విభాగం వరంగల్ ట్రై-సిటీస్ ప్రాంతంలో తొలి స్వతంత్ర ట్రాన్స్‌కాథెటర్ ఏఆర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిందని బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. తీవ్రమైన ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండెదడ వంటి సమస్యలతో బాధపడుతూ రోజువారీ కార్యకలాపాలు నిర్వహించలేని స్థితిలో ఉన్న 65 ఏళ్ల మహిళను వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్‌లో చేర్చారు. వైద్య పరీక్షల్లో ఆమెకు ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే తీవ్రమైన ఏఆర్టిక్ స్టెనోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం హార్ట్ టీమ్ అత్యాధునిక ట్రాన్స్‌కాథెటర్ ఏఆర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ విధానం ద్వారా చికిత్స చేయాలని నిర్ణయించింది. 23 మిల్లీమీటర్ల ట్రాన్స్‌కాథెటర్ హార్ట్ వాల్వ్‌ను ఉపయోగించి ఈ క్లిష్ట ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వాసు పర్యవేక్షణలో డాక్టర్ శ్రవణ్ రాంపెల్లి, డాక్టర్ సంతోష్ మోదాని సహకారంతో సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ షఫీ పాలగిరి 40 నిమిషాలలో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షఫీ పాలగిరి మాట్లాడుతూ, “గుండె వాల్వ్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇకపై హైదరాబాద్ వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రపంచ స్థాయి టిఎవిఆర్ వంటి అత్యాధునిక చికిత్సలు ఇప్పుడు వరంగల్‌లోనే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విజయవంతమైన చికిత్సతో వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ తెలంగాణలో ప్రముఖ స్ట్రక్చరల్ హార్ట్ కేర్ కేంద్రంగా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుందని వైద్యులు పేర్కొన్నారు.

## వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా వెంకటరమణ



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్03(విజన్ ఆంధ్ర); సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డి.ఎస్పీ గా నియమించబడిన యం. వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజే శారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ నేరాలపై మరింత అవగహన కల్పించాలని సీపీ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సైబర్ క్రైమ్ డి. ఎస్పీగా పనిచేసిన కె. గిరికుమార్ మహబూబ్నగర్ సైబర్ క్రైమ్ డిఎస్పీగా బదిలీ అయ్యారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 03 (విజన్ ఆంధ్ర బ్యూరో): గుడ్డెం దొడ్డి ప్రాజెక్టు సందర్శనకు జిల్లాకు వస్తున్న సీఎం పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం సాయంత్రం ధరూర్ మండలం గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద హెలిపాడ్ నిర్మాణం, ఇతర పనులను జిల్లా కలెక్టర్ ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్ నుంచి పంప హౌస్ కు వెళ్లే దారి మరమ్మత్తు పనులు పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును నియమించామని పేర్కొన్నారు. అంబులెన్స్, ఫైర్ వాహనం అందుబాటులో ఉంటుందని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన డాక్టర్లను అందుబాటులో ఉం చుతున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులను ఆహ్వానించడం మొదలుకొని తిరిగి వెళ్లే సమయం వరకు వీడ్కోలు పలికేందుకు అన్ని ఏర్పాట్లను ప్రోటోకాల్ ప్రకారం చేస్తున్నామన్నారు. జిల్లా ప్రాజెక్టులతో ఫోటో ఎగ్జిబిషన్, ఇతర ఏర్పాట్లన్ని చేయడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మల్లిఖార్జున్



కామారెడ్డి బ్యూరో జున్ 3 (విజన్ఆంధ్ర): కామారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మల్లిఖార్జున్ బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన దృశ్యం.

# వేములవాడ బండ్ పార్క్‌కు ఆధ్యాత్మిక శోభ

**ప్రత్యేక ఆకర్షణగా 40 అడుగుల మహాశివుడి విగ్రహం, సప్తమాతృకల ప్రతిమలు**
**త్వరలో అందుబాటులోకి బోటింగ్ సదుపాయం.. పర్యాటకాభివృద్ధికి కొత్త ఊపు**



వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 03: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ పుణ్యక్షేత్రానికి మరింత ఆధ్యాత్మిక, పర్యాటక ఆకర్షణను జోడించేలా గుడి చెరువు బండ్ పార్క్ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా రూపొందిస్తున్న ఈ పార్క్‌లో 40 అడుగుల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాతృకల విగ్రహాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా గుడి చెరువు పరిసర ప్రాంతాన్ని సుందరీకరించడంతో పాటు భక్తులు, పర్యాటకులు విశ్రాంతి తీసుకునేలా



ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆలయానికి సమీపంలో ఉండటంతో ఈ పార్క్ భక్తులకు మరింత ఆకర్షణీయంగా మారనుంది. కొన్ని నెలల క్రితం గుడి చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పార్క్‌లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆ మేరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మహా శివుడి విగ్రహంతో పాటు సప్తమాతృకల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అదే సమయంలో గుడి చెరువులో బోటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ తుది దశలో ఉండగా, త్వరలోనే బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే కుటుంబాలతో వచ్చే భక్తులు, పర్యాటకులకు వినోదంతో పాటు వేములవాడ పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించనుంది. బండ్ పార్క్‌లో



ఏర్పాటు చేసిన శివుని విగ్రహం, సప్తమాతృకల ప్రతిమలు ఇప్పటికే స్థానిక ప్రజలను ఆకట్టుకుంటుండగా, అభివృద్ధి పనులపై పట్టణ వాసులు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలి: కలెక్టర్

బుధవారం బండ్ పార్క్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, మిగిలిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి పార్క్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పార్క్‌లో నేమ్ బోర్డులు, మరుగుదొడ్లు, ఎవెన్యూ ప్లాంటేషన్ వంటి మౌలిక సదుపాయాలను పూర్తి చేయడంతో పాటు బోటింగ్ సదుపాయాన్ని కూడా త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అన్ని పనులు పూర్తయ్యాక బండ్ పార్క్ వేములవాడకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె హరిత..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ – 3 (విజన్ ఆంధ్ర): జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ కె హరిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నీటి పారుదల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, పంచాయతీ రాజ్ భవనాల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సిబ్బంది సమయపాలనను పాటించాలన్నారు. నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో మాట్లాడుతూ... చెరువులు, కాలువల మరమ్మత్తులను త్వరితగతిన చేయాలని, ఎలాంటి ఆటంకం కలగకుండా సాగునీటిని అందించాలని కోరారు. కాలువలలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా చూడాలని, కాలువల తూముల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలో కార్యాలయాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 108 సేవల మాదిరిగా మాజీ మంత్రి హరీశ్ రావు సేవలు

**హరీశ్ రావు జన్మదినం సందర్భంగా**
**- రక్తదాన శిబిరం, ప్రభుత్వం ఆసుపత్రి లో పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం**
**- చింత ప్రభాకర్ గారు సంగారెడ్డి**

సంగారెడ్డిబ్యూరో, జూన్ 3(విజన్ ఆంధ్ర ): సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో , సదాశివపేట లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి హరీశ్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తదుపరి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్, హరీశ్ రావు సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై అదే స్థాయిలో స్పందిస్తూ పనిచేసే నాయకుడు హరీశ్ రావు గారు అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం హరీశ్ రావు గారి పనితీరును మెచ్చుకునే వారని అన్నారు. హరీశ్ రావు గారు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో పాటు మరింత మేధస్సు, శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, వేణుగోపాలస్వామి, సునీల్ జై, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జూన్ 08 నాటికి పూర్తి స్థాయిలో స్మార్ట్ కిచెన్ షెడ్స్ సిద్ధం కావాలి

**మండల ప్రత్యేక అధి కారులు ప్రత్యేక శ్రద్ధ తో పనిచేయండి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

కడప,జూన్ 03: (విజన్ ఆంధ్ర)వై ఎస్ ఆర్ కడప జిల్లా లో విస్తృతంగా విద్యార్థులకు నాణ్యమైన,రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ను అందించేందుకు ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు జూన్ 08 వ తేదీ నాటికి సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కేఎంసీ కమిషనర్ హెచ్.ఎస్. భావనతో కలిసి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతి పై.సంబంధిత జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఏ జిల్లా లో లేని విధంగా వై ఎస్ ఆర్ కడప జిల్లాలో అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తూ.రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రకటించడం స్ఫూర్తి దాయకమనన్నారు. జిల్లా లో అన్ని మండలాల లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా అన్ని మండలాల్లోని విద్యార్థులకు అందించేందుకు అన్ని మండలాల్లో జరుగుతున్న స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో జూన్ 08 నాటికి సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.వేసవి సెలవుల అనంతరం విద్యా సంవత్సరం ప్రారంభం నకు ముందు గానే జిల్లా లో నిర్మాణంలో ఉన్న అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్వహణ లోకి తీసుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు.కిచెన్ గార్డెన్స్, కూరగాయల



తోటల పెంపకం, కొనుగోలు సంబంధిత అంశాలపై ఎపి సీఎన్ఎఫ్, డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ల వద్ద టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, షెడ్స్ నిర్మాణ పనులు ఆయా మండలాల్లో వివిధ దశల్లో పురోగతిలో ఉన్న భవనాల పూర్తి లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమదృష్టికి తీసుకురావాలన్నారు.స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే.. (త్రాగునీటి సరఫరా,పవర్ సప్లై, డ్రైనేజ్ వ్యవస్థ),మౌలిక సదుపాయాల పై అంశాల వారీ గా సమీక్షించి. పాఠశాలలకు ఫుడ్ ట్రాన్స్ పోర్టేషన్ కు అవసరమైన వాహనాలు మొదలైన అంశాలపై సమీక్షించారు.స్మార్ట్ కిచెన్ లు జూన్ 08 నాటికి సిద్ధం కావాలని ఈ ప్రక్రియలో ఎక్కడా కూడా జాప్యం జరగకూడదని అధికారులను హెచ్చరించారు.విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం ను అందించడం తో పాటు వారు శుభ్రత తోఉండేలా.మరియు భోజన సమయానికి ముందు చేతులు శుభ్రం చేసుకొని భోజనం చేసేలా విద్యార్థులకు ఒక అలవాటు గా మార్చే విధంగా ప్రతి పాఠశాల లో ఒక టీచర్ ఈ అంశం ను పర్యవేక్షణ చేయాలని డి ఈ ఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ హజరతయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్,డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, డిఏవో శంశుద్దీన్, హౌసింగ్ పీడి రాజరత్నం,ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు,ఎల్డిఎం జనార్దనం, నాబార్డు డిడిఎం విజయ్ విహారి,ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ఏడుకొండలు, విద్యాశాఖ,సమగ్ర శిక్ష అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి నివేదిక బస్సుయాత్రలో

**ఆర్డీఎస్ కి శాశ్వత పరిష్కారం చూపిస్తా**
**వల్లూరు, మల్లమ్మ కుంట పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీది,నాది**
**బస్సు యాత్రలో డా.ఎస్.ఏ. సంపత్ కుమార్**

వడ్డేపల్లి జూన్ 03 ( విజన్ ఆంధ్ర): నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు పోరాడుతానని, వచ్చే ఎన్నికల్లో మీరు ఆశీర్వదిస్తే కచ్చితంగా క్యాబినెట్లో ప్రాతినిధ్యం వహిస్తానని బస్సు యాత్రలో సంపత్ కుమార్ అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు ఎంపీ మల్లు రవి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సుయాత్ర కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మధ్యాహ్నం వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ పట్టణ కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ బస్సు యాత్ర చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు మాయమాటలు చెప్పి ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా చలామణి అవుతూ ప్రజలను పట్టించుకోవడం లేదని సంపత్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం వలన నేను ఓడిపోయినప్పటికీ అత్యంత సన్నిహితులైన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం వలన అలంపూర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రతి పేదవాడికి న్యాయం చేయగలుగు తున్నానని సంపత్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం అలంపూర్ ప్రజల శ్రేయస్సు కొరకు పాటుపడతానని, రాజకీయాల్లోకి వచ్చింది సొంత లాభం కోసం కాదు ప్రాంత అభివృద్ధి, ప్రజల జీవన విధానంలో మార్పు కోసం రాజకీయాల్లోకి వచ్చాను అని అన్నాడు. ఇదివరకే పూర్తి కావాల్సిన వల్లూరు, మల్లమ్మ కుంట లాంటి అనేక నీటిపారుదల ప్రాజెక్టులు టిఆర్ఎస్



పార్టీ అసంపూర్తిగా వదిలేసిందని వాటిని పూర్తి చేసి ఆర్డీఎస్ కు శాశ్వత పరిష్కారం చేస్తానని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని రాబోయే రోజుల్లో మరిన్ని ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గానికి తీసుకువచ్చి పూరి గుడిసె లేని గ్రామాలుగా అలంపూర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలని సంకల్పం పెట్టుకున్నామని సంపత్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అటువంటి ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సులో ఉచిత ప్రయాణం లాంటి తదితర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రతి అర్హుడికి ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందించాలని సంకల్పంతో ఈ బస్సు యాత్ర ముందుకు సాగుతుందని సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, వడ్డేపల్లి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వడ్డేపల్లి పట్టణ అధ్యక్షులు చిన్ని బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు దేవేంద్ర, మహిళ నాయకురాలు నాగ శిరోమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ పర్చర్ల కుమార్, రాజోలి సర్పంచ్ గంగిరెడ్డి, ఎల్లారెడ్డి, జగన్ గౌడ్, యోగి రెడ్డి, తదితరులు, ముఖ్య నాయకులు, మహిళలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత కుటుంబ సలహా కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జూన్ 03 ( విజన్ ఆంధ్ర బ్యూరో): గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనం నందు ఉచిత కుటుంబ సలహా కేంద్రంను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. వేసవికాలం శిక్షణలో భాగంగా కిశోర బాలికలకు నిర్వహించిన ఆట పోటీలు వ్యాసరచనలు మొదటి, ద్వితీయ బహుమతి సాధించిన కిశోర బాలికలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ సైకిల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం మహిళలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలని, మహిళలకు మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలను అందజేయడం జరుగుతుంది. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా వినూతమైన ఆలోచనతో మహిళా సంఘాలలో సమస్యలు ఉన్న వారి కుటుంబంలో సమస్యలు ఉన్న పరిష్కరించగలరని విధంగా మహిళా సంఘాల సమైక్యత ద్వారా కృషి చేయడం జరుగుతుంది తెలిపారు. ఎవరు కూడా సమస్యలను కొనితెచ్చుకోరాదు. వారి సమస్యలను వారే పరిష్కరించుకోవాలని కూర్చొని




మాట్లాడుకుంటే సమస్యలను పరిష్కారం సాధ్యమవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, గద్వాల తిమ్మప్ప, అలీ శ్రీనివాసరెడ్డి, రాజప్ప గౌడు, గోవిందు, హనుమంత్ రెడ్డి, యువ నాయకులు సంతోష్, రామకృష్ణ నాయుడు, మధుసూదన్ రెడ్డి, ఆనంద్, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

**మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు...**
**మడికొండలో మహిళల పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన చేసిన కలెక్టర్ చాహత్, ఎంపీ కావ్య, ఛైర్మన్ ఇనుగాల, ఎమ్మెల్యే నాగరాజు**


హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 03 ( విజన్ ఆంధ్ర ): హన్మకొండ జిల్లా మడికొండ మహిళా ప్రాంగణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న పెట్రోల్ బంక్‌కు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, అధికారులతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, మహిళల పేరుమీదే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే మహిళా సంఘాలకు అధిక మొత్తంలో వడ్డీలేని రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంపై కొందరు



విమర్శలు చేసినప్పటికీ, ప్రభుత్వం మహిళలను కేవలం ప్రయాణికులుగానే కాకుండా ఆర్టీసీ వ్యవస్థలో భాగస్వాములు, యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోందని వివరించారు. మడికొండలో మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కావడం ఆనందదాయకమని, మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలు విద్యావంతులు, ఆర్థికంగా స్వావలంబులు అయినప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే నాగరాజు , మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి మహిళలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు మరియు మహిళలు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు...

## కేసీఆర్ వెన్నంటి నడుస్తున్న నిబద్ధత కలిగిన నాయకుడు హరీష్ రావు

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 03 ( విజన్ ఆంధ్ర ): కేసీఆర్ వెన్నంటి నడుస్తున్న నిబద్ధత కలిగిన బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ పార్టీ శాసనసభ ఉప పక్ష నేత, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన బుధవారం రోజున నిర్వహించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం నందు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ వెన్నంటి నడిచిన నిజమైన, నికార్సైన గులాబీ సైనికుడు హరీష్ రావు గారని అన్నారు. ట్రబుల్ షూటర్, భారత రాష్ట్ర సమితి పార్టీ పార్టీ వెన్నెముక, కార్యకర్తల కోసం నిరంతరం శ్రమిస్తున్న గొప్ప నాయకుడు హరీష్ రావు గారని కొనియాడారు. హరీష్ రావు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించమని అన్నారు.

# పోలీస్ సిబ్బంది కోరుకున్న పోలీస్ స్టేషన్ కు బదిలీ..

- పారదర్శకంగా కౌన్సిలింగ్.
- సిబ్బంది ఆరోగ్యం, సేవలు, పనితీరుకు ప్రాధాన్యం ఇస్తూ బదిలీ
- వత్తిడి, సమస్యలను అధిగమించి పని చేయాలి
- వివాదాలకు తావులేకుండా చట్టపరిధిలో పని చేయాలి
- ప్రజలకు పోలీస్ సేవలు అందించడంలో సమర్థవంతంగా పని చేయాలి

సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ





సూర్యాపేట జూన్ 03 (విజన్ ఆంధ్ర): జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తున్న 77 మంది హెడ్ కానిస్టేబుళ్ల కు, 25 మంది కానిస్టేబుళ్లకు పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీచేసిన జిల్లా ఎస్పి నరసింహ వివాదాలకు తావులేకుండా ఒత్తిడిని సమస్యలను అధిగమిస్తూ ప్రజలకు పోలీసు సేవలు అందించడంలో చట్ట పరిధిలో సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ ల నందు పని చేస్తూ అయా పోలీస్ స్టేషన్ ల నందు సర్వీసు కాలం పూర్తి చేసుకున్న 77 మంది హెడ్ కానిస్టేబుళ్లకు, 25 మంది కానిస్టేబుళ్లకు ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి సిబ్బంది కోరుకున్న పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ మాట్లాడుతూ కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చాం, అనుభవాన్ని ఉపయోగించి పోలీసు సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు పని చేస్తూ సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన అనుభవం ఉన్నదని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి ఈ స్థాయికి వచ్చారు అన్నారు, మీ యొక్క పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌజ్ అధికారి కి, జూనియర్స్ కు, తోటి సిబ్బందికి పనిలో కలుపుకుని కష్ట పడి పని చేస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపినారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యం, మెళకువలు చూపాలి, కొత్త చట్టాల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ స్టేషన్ ఇంఛార్జి అధికారిగా పోలీస్ స్టేషన్ లో అన్ని విధులను, పనులను పర్యవేక్షణ చేయాలి. సమస్యలు, ఫిర్యాదులను పై అధికారుల దృష్టిలో పెట్టాలి. అధికారులతో మంచి సమన్వయం కలిగి ఉండాలి అన్నారు. హెడ్ కానిస్టేబుల్ బాధ్యతగా ఉండకపోతే స్టేషన్ లో ఉన్న క్రింది స్థాయి సిబ్బంది పనిలో నైపుణ్యం సాధించలేరు అన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే సాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలని సూచించారు. మంచి ఆహార అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి, సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం, యోగ చేయడం లాంటి చేయాలి అన్నారు. రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు, విధులు నిర్వర్తించే చోటే నివాసం ఉండాలని అన్నారు.
అంచనాలకు మించి పని చేయాలని అన్నారు. పిర్యాదుదారుల పట్ల మర్యాద ప్రవర్తించాలి, బరోసా కల్పిస్తూ వేగంగా స్పందించాలని సూచించారు. సామాజిక అంశాలు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాలు, డ్రగ్స్ గంజాయి నిర్మూలన, అసాంఘిక చర్యల నిర్మూలన పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు. చట్టప్రకారం పని చేయండి. నేరాలు, తప్పులు చేసేవారి పట్ల, ప్రజలను ఇబ్బంది పెట్టే వారి పట్ల. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు అన్నారు. ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ సబితా రాణీ, సీసీ సందీప్, సిబ్బంది ఉన్నారు.

## ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్03(విజన్ ఆంధ్ర); ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్) కూడా చైర్మన్ ఏనుగాల వెంకట్రామ్ రెడ్డి వరంగల్ జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కమిటి మెంబర్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి (కమిటీ కన్వీనర్), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అడ్మిన్ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతుల మెరుగుదలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

## విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా సాయం



ముధోల్ జూన్ 03 (విజన్ ఆంధ్ర): నిర్మల్ జిల్లా :ముధోల్ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎన్పీడీసీఎల్ లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా సాయం అందింది. మృతుడి భార్య స్వప్నకు ఈ బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రజాభవన్‌లో అందజేశారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్‌తో అమలులో ఉన్న శాలరీ ప్యాకేజీ బీమా పథకం కింద ఈ ప్రయోజనం లభించింది. బాసరలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్ గత ఏడాది విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా, నామినీగా ఉన్న ఆయన భార్య స్వప్నకు బీమా మొత్తాన్ని మంజూరు చేశారు. ఈ సాయం బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్, యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం, సంస్థలు కట్టుబడి ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జూన్ 7లోగా మొక్కజొన్న సేకరణ పూర్తి చేయాలి -కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 3(విజన్ఆంధ్ర): పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సదాశివనగర్ మండలం పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు, రవాణా ప్రక్రియల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 18,840 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 15,000 క్వింటాళ్ల మొక్కజొన్నను ఇప్పటికే గోదాములకు తరలించగా, ప్రస్తుతం కేంద్రం వద్ద 3,840 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు. అలాగే కేంద్రంలో ఇంకా 16 మొక్కజొన్న కుప్పలు ఉండగా, వాటి ద్వారా సుమారు 3,000 సంచుల మొక్కజొన్న కొనుగోలు జరిగే అవకాశం ఉందని వివరించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. జూన్ 7వ తేదీలోగా మొక్కజొన్న సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని డీఎం మార్క్‌ఫెడ్‌ను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిగా అందేలా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా సహకార అధికారి (డీసీఓ), డీఎం మార్క్‌ఫెడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీసీఎస్ఓ), డీఎం (సివిల్ సప్లైస్), తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి (ఎంఏఓ), మానిటరింగ్ అధికారి, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్, వార్డు సభ్యులు, పీఏసీఎస్ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నిత్య జీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌శ్రీను నియంత్రించాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల జూన్ 03 (విజన్ ఆంధ్ర బ్యూరో): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం భూమి, నీరు,జీవ వైవిధ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలైన గుడ్డ సంచులు,స్టీల్ బాటిళ్లు, గాజు సీసాలు,వెదురు ఉత్పత్తులు,ఆకు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి పారవేయడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని పేర్కొన్నారు. తగ్గిద్దాం తిరిగి వాడుదాం పునర్వినియోగం చేద్దాం అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన,వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మన భూమి మన బాధ్యత అనే భావనతో ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ పాపయ్య,సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డా.విద్యులత, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 3(విజన్ఆంధ్ర): సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారురాలు పిల్లి సాయవ్వతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో పూరి గుడిసెలో నివసిస్తూ వర్షాలకు తన ఇల్లు కోల్పోయానని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ద్వారా సురక్షితమైన నివాసం కలగబోతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి కుటుంబానికి సురక్షితమైన గృహం అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఎక్కడా కూడా పూరి గుడిసెలు కనిపించకూడదని, అధికారులు ప్రతీ గ్రామాన్ని పర్యటించి చర్యలు చేపట్టాలని, గ్రామీణ పేద కుటుంబాల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో రూ.1.59 కోట్లు 45 లక్షల బ్యాంకు రుణాలను 90 మంది లబ్ధిదారులకు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలను చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో సత్యనారాయణ, ఎంపీడీవో, ఎంపీ ఓ , పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

## కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ కు ఉత్తరాఖండ్ సీఎం అభినందనలు...

సీఎం పుష్కర్ సింగ్ ధామిని సన్మానించిన మేయర్ కోలగాని



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 03..ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రోజున జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించి , శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇటీవల బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో, మేయర్ గా అతి పిన్న వయసు కలిగిన కోలగని శ్రీనివాస్ నియామకం కావడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామికి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. అలాగే సమావేశాలకు అతిథులుగా హాజరైన ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులు సుబోధ్ ఉన్నియాల్, ప్రేమ్ చంద్ర అగర్వాల్ , మదన్ కౌశిక్ ,లోకసభ సభ్యులు (హరిద్వార్) త్రివేంద్ర సింగ్ రావత్ రాజ్యసభ సభ్యులు మహేంద్ర భట్, డా. ప్రేమ్ చంద్ర అగర్వాల్ (ఎమ్మెల్యే, ఋషికేశ్ నియోజకవర్గం)లను మేయర్ కోలగని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు పెంచాలి

పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 3, (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలలో విద్యార్థుల ప్రదేశాలు కేంద్రాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో 100 శాతం సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల అవకాశాలు ఉన్న కోర్సులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అధికారులు ప్రభుత్వ కళాశాలలు బలోపేతం కొరకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల సంఖ్య 100 శాతం ఉండేలా ఉపాధ్యా యుల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, విద్యాధికారులతో సమీక్ష, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మాధ్యమిక విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


## ప్రైవేటు వద్దు...ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

బడిబాట ప్రతిజ్ఞ చేయించిన సర్పంచ్ నాగిరెడ్డి



నారాయణపేట, జూన్ 3 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలు ముద్దు ప్రైవేట్ పాఠశాలలు వద్దు అని నారాయణపేట మండ లం సింగారం సర్పంచ్ కే.నాగిరెడ్డి జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయురా లు భారతి అన్నారు. బుధ వారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం సింగారం పర్యటించారు.. ఈ కార్యక్ర మంలో సింగారం గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఉప సర్పంచ్ లక్ష్మణ్ గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామసభలో మాట్లాడుతూ విద్యార్థులను తప్పకుండా ప్రతి తల్లిదం డ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపాలని,పిల్లలు చదివితే ఎంతో ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో విశాలమైనటువంటి గదులు అన్ని వసతులు తో ఉన్నా యని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు, పాలు రాగిజావ, రుచికరమైనటువంటి మధ్యాహ్న భోజనము, ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తారన్నారు. నేడు ప్రైవే ట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉంటాయని ప్రతి తల్లిదండ్రు లు తప్పకుండా తమ పిల్లల ను పంపి ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభలో సర్పంచ్ నాగిరెడ్డి బడిబాట ప్రతిజ్ఞను విద్యార్థు ల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు భారతి మాట్లాడుతూ మా పాఠ శాలలో శిక్షణ పొందిన టువంటి ఉపాధ్యాయులు ఉన్నారని,ఈ పాఠశాలలో రోబెటిక్ శిక్షణ సైన్స్ ల్యాబ్ కరాటే ప్రతి విద్యార్థి పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మీ పిల్లలు మా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మప్ప,సింగారం ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జయప్రకాష్ నాయక్, ఉపాధ్యాయులు భీమప్ప,దత్తాత్రేయ, భాస్కర్, సాయప్ప, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ ,మధుసూదన్ ,భాను ప్రకాష్ ,లక్ష్మణ్ ,నరసింహ, నర్సింలు ,రఘురాంరెడ్డి, నిర్మల,శశిరేఖ,శ్రీదేవి,శిరీష తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సభలలో పలు అంశాలపై చర్చించాలి: కలెక్టర్ కె. హరిత




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ - 03 (విజన్ ఆంధ్ర ): గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించే గ్రామ, వార్డు సభలలో పలు కీలక అంశాలపై చర్చించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి అన్ని మండలాల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ సభలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా నాణ్యత:రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలి. క్లోరినేషన్ ప్రక్రియ నిరంతరం జరిగేలా చూడాలి. పరిశుభ్రత - డ్రైనేజీల నిర్వహణ:గ్రామాల్లో, మున్సిపల్ వార్డులలో వీధులు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చర్యలు చేపట్టాలి. మురికి కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలి. వ్యవసాయం - విత్తనాలు, ఎరువులు: వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలి. నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠినంగా వ్యవహరించాలి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవగాహన కల్పించాలి. ఓటరు నమోదు ప్రక్రియఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం బూత్ లెవెల్ అధికారులు (దీూా) ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా గ్రామ సభలలో అవగాహన కల్పించాలి. వైద్యారోగ్యం (ిదీ వ్యాధి నిర్మూలన):లిలి గ్రామాల్లో టీబీ (ిదీ) వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి సరైన వైద్య సహాయం మరియు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందేలా చూడాలి. సంక్షేమ పథకాలు & ప్రగతి పనులు 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి. స్వయం సహాయక సంఘాల (ాఎ+) మహిళలకు అవసరమైన రుణాలు, ప్రోత్సాహం అందించాలి. గ్రామాలలో పారిశుద్ధ్యం విద్యుత్ ఆదా సమస్యల పరిష్కారాలపై ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహంతో పాటు నగదు బహుమతి అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ (స్థానిక సంస్థలు), జెడ్పీ సీఈఓ, డీఆర్డీఓ, డీపీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఈఈహ (=ఔా), వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ డిజిటల్ మెంబర్‌షిప్, సర్ ప్రక్రియ అవగాహన సదస్సు



కల్వకుర్తి జూన్ 4 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సర్ ప్రక్రియ మరియు డిజిటల్ మెంబర్‌షిప్ (సభ్యత్వ నమోదు) డ్రైవ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు. ఈ సదస్సు జూన్ 4వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వెల్దండ మండలంలోని తోడేటి చెన్నారెడ్డి గార్డెన్స్‌లో జరగనుంది. తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ మరియు నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్, కల్వకుర్తి సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి వేద రజని పాల్గొంటారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నిర్వహిస్తున్న డిజిటల్ మెంబర్‌షిప్ డ్రైవ్‌ను విజయవంతం చేయడం, SIR ప్రక్రియపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించడం, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, అనుబంధ సంస్థల నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, తాజా మరియు మాజీ ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల వెంకటేష్ కోరారు.

# చర్లలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

**కాంగ్రెస్‌లోకి పద్మశాలి సంఘం కీలక నేతలు!**
**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో హస్తం గూటికి..**
**మారుతున్న చర్ల టౌన్ రాజకీయ సమీకరణాలు!**
**చేరికలపై బీఆర్ఎస్ నేతల తీవ్ర నిరసన**
**"పదవుల కోసమే వలసలు" అంటూ బిఆర్ఎస్ నాయకులు పెదవి విరుపు!**

చర్ల, జూన్ 3 (విజన్ ఆంధ్ర): చర్ల పట్టణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది, అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతుండటంతో స్థానిక సమీకరణాలు వేగంగా మారుతున్నాయి, బుధవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు, ముఖ్యంగా పద్మశాలి సంఘానికి చెందిన ప్రభావవంతమైన నేతలు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు విజయ్ నాయుడు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వారిలో పద్మశాలి సంఘం ప్రముఖ నేతలు చింత నాగేంద్ర బాబు, ఇరసవడ్ల రాము, చిప్ప మూర్తి, అలవాల మురళిలతో పాటు సీపీఎం పార్టీ సభ్యులు బండారి నరసింహారావు ఉన్నారు, వీరందరికీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువాలు




కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమానికి ఆకర్షితులయ్యే చేరిక చింత నాగేంద్ర బాబు

ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నేత చింత నాగేంద్ర బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ విధానాలు, రాష్ట్రంలో పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేస్తున్న కృషిని వారు అభినందించారు.

టౌన్‌లో పెరిగిన 'హస్తం' బలం : పద్మశాలి సంఘంలో బలమైన క్యాడర్, ప్రజాదరణ కలిగిన నేతలు కాంగ్రెస్‌లో చేరడంతో చర్ల టౌన్‌లో పార్టీకి కొండంత బలం చేకూరిందని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి, ఇటీవల వరుస చేరికలతో కాంగ్రెస్ పార్టీ గ్రామాలు, పట్టణాల్లో తన ప్రభావాన్ని మరింత విస్తరించుకుంటోందని, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాలు మరింత ఖాళీ అవ్వడం ఖాయమని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

ఈ చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి, మండల అధ్యక్షులు విజయ్ నాయుడు, సీనియర్ నాయకులు లంక రాజు, తాండవ రాయుడు, ముమ్మానేని అరవింద్, నాని బాబు, బ్రహ్మానంద రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని, కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ కౌంటర్ : స్వార్థ రాజకీయాలే తప్ప పార్టీకి నష్టమేమీ లేదు

మరోవైపు ఈ చేరికలపై స్థానిక బీఆర్ఎస్ మండల, పట్టణ నాయకత్వం తీవ్రంగా స్పందించింది, కొందరు నేతలు పార్టీ మారినంత మాత్రాన చర్లలో బీఆర్ఎస్ బలాన్ని ఎవరూ తగ్గించలేరని వారు తేల్చిచెప్పారు,

అవకాశవాద రాజకీయాలు చేస్తూ పార్టీలో ఉంటూ కేవలం పేరుకే చలామణి అయిన కొందరు వ్యక్తులు, కేవలం స్వార్థ ప్రయోజనాలు, పదవుల కోసమే అధికార పార్టీ వైపు చూస్తున్నారు, గత పదేళ్లుగా బీఆర్ఎస్ హయాంలో అన్ని రకాల లబ్ధి పొంది, ఇప్పుడు పార్టీ మారడం వారి అవకాశవాదానికి నిదర్శనం అంటున్నారు

యువత, క్యాడర్ మా వైపే : నాయకులు మారొచ్చు కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న కరుడుగట్టిన గులాబీ క్యాడర్, ఉత్సాహవంతులైన యువత (యూత్ వింగ్) ఎప్పటికీ బీఆర్ఎస్ వైపే ఉన్నారు, చర్ల మండలంలో పార్టీ పునాదులు చాలా బలంగా ఉన్నాయి.

ప్రజల గుండెల్లో కేసీఆర్ : కెసిఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చర్ల ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉన్నాయని, ఆ నమ్మకమే రాబోయే రోజుల్లో మాకు కొండంత అండ అని ఎవరు ఉన్నా, లేకపోయినా ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ చర్లలో మళ్లీ జెండా పాతడం ఖాయం అని,నాయకుల వలసలతో పార్టీకి ఎలాంటి నష్టం లేదని, త్వరలోనే సరికొత్త వ్యూహాలతో, యువ నాయకత్వంతో చర్ల టౌన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి.

## గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 03, (విజన్ ఆంధ్ర): ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డుసభలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలనీ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాల్ నుండి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామా,వార్డు సభల నిర్వహణ, ఏర్పాట్లు, జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన- ప్రగతి ప్రణాలికలో భాగంగా రేపటి నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టిన 'గ్రామసభల'ను అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా జనగణన, భూభారతి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ టైమ్ మెంబర్‌షిప్ తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రాబోయే వర్షాలు, వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, విరిగిన విద్యుత్ స్తంభాలను, వేలాడుతున్న ప్రమాదకర విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి, పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా బడిబాట' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్లు రాజేశ్వర్,ఆర్.ఎస్.చిత్రు , జడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సైకిలింగ్ ఎంతో దోహదం

### అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 03, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ... ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' పర్యావరణ వారోత్సవాలల్లో భాగంగా ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "శూన్య ఇంధనం - గరిష్ట ఆరోగ్యం" అనే నినాదంతో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో భారీ సైకిల్ ర్యాలీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సైకిల్ ర్యాలీ జిల్లా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమై కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, ఇంధన పొదుపునకు సైకిల్ తొక్కడం ఎంతో మేలైన మార్గమని వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలని, రోజువారి సైక్లింగ్ అనేది అద్భుతమైన వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని వివరించారు. పర్యావరణ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై



ప్రజల్లో అవగాహన కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే రాబోయే జూన్ 7 (ఆదివారం) "5ఖ రన్" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ. 5000, రూ. 3000, రూ. 2000 నగదు బహుమతులు ఉంటాయని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంతకుముందు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మానవ హారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అవినాష్, అటవీ శాఖ సిబ్బంది, వివిధ క్రీడాకారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

## జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప

గద్వాల జూన్ 03 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : రాబోయే వానాకాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో వర్షాలు సాధారణంగా కురిసే అవకాశం ఉన్నప్పటికీ జూలై,ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు. తేలికపాటి భూముల్లో కంది, పెసర, మినుము, పత్తి వంటి లోతైన వేర్లు కలిగిన, తక్కువ వ్యవధి పంటలను సాగు చేయాలని, నల్లరేగడి భూముల్లో మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, మిరప వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు. జూన్‌లో వర్షాలు బాగా పడ్డాయని తొందరపడి పంటల ఎంపిక చేయవద్దని, వర్షాభావ సమయంలో ఒక తడి నీరు అందించగల రైతులు మాత్రమే అధిక పెట్టుబడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని, భవిష్యత్తులో ఎరువుల పంపిణీ, పీఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాల లబ్ధికి ఇది అవసరమని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు మిశ్రమ, అంతర పంటల సాగు చేపట్టాలని, పంటల కీలక దశల్లో అవసరమైతే లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ ఇవ్వాలని సూచించారు. రాబోయే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టి, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు, మల్చింగ్ వంటి సాంకేతికతలను వినియోగించాలని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చరాదని హెచ్చరించారు. అలా చేయడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా పర్యావరణానికి హాని కలుగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు నానో యూరియాను వినియోగించి ఎరువుల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**భద్రత ద్వారా మంజూరైన రూ.8 లక్షల ఆర్థిక సహాయ పత్రాల అందజేత**
**జనవరి 5న గుండెపోటుతో మరణించిన కానిస్టేబుల్ రాథోడ్ విలాస్ కుటుంబానికి సాయం**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 03, (విజన్ ఆంధ్ర) :బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 5న ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్ (35) గుండెపోటుతో మృతి చెందారు. స్వర్గస్తులైన కానిస్టేబుల్‌కు భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు రాథోడ్ రష్మిక, రాథోడ్ తనిష్ ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో రాథోడ్ విలాస్ కుటుంబ సభ్యులైన భార్య జ్యోతి, అన్నయ్య కైలాష్‌లకు భద్రత పథకం ద్వారా మంజూరైన రూ.8 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన



పత్రాలను జిల్లా ఎస్పీ అందజేశారు. ఇందులో భార్య జ్యోతికి రూ.4 లక్షలు, పిల్లలు రాథోడ్ రష్మిక మరియు రాథోడ్ తనిష్‌ల పేర్లపై తలా రూ.2 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడం జరిగింది. కానిస్టేబుల్ రాథోడ్ విలాస్ మరణం పోలీసు శాఖకు తీరని లోటని ఎస్పీ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రభుత్వం ద్వారా రావలసిన అన్ని లబ్ధులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శివకుమార్, సీసీ కొండరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు వైద్యులు కట్టుబడి పని చేయండి

**జిల్లా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ లు ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందించేందుకు అందుబాటు లో ఉండాలి**
**వైద్యులు సమయపాలన పాటించాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

కడప,జూన్ 03: (విజన్ ఆంధ్ర)ప్రజారోగ్య పరిరక్షణ కు వైద్యులు కట్టుబడి పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖ చే అమలు అవుతున్న కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ను బలోపేతం చేస్తూ చర్యలు చేపట్టడంజరిగిందనితెలిపారు ప్రభుత్వ ఆసుపత్రులలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే పేషంట్స్ కు సకాలం లో వైద్యులు అందుబాటు లో ఉండి వైద్య సేవలు అందించడం లో కూడా పూర్తి బాధ్యత, అంకిత భావం తో పనిచేయాలని తెలిపారు అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషంట్స్ తో వారి అనారోగ్య సమస్యలను ఓపిక తో విని చిరునవ్వు తో వైద్యసేవలు అందించాలన్నారు. వచ్చిన పేషంట్స్ తో రిసెప్షన్ లోనే మంచి గా మాట్లాడి అనారోగ్య సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు.వైద్యులు




సమయపాలన పాటించాలని,సెలవులు తీసుకొనేందుకు ముందస్తు గా అనుమతి తీసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అవకాశం ఉంటుందనన్నారు. మెడికల్ ఆఫీసర్స్ వారి పరిధి లో ఉన్న సిబ్బంది తో సమావేశాలు నిర్వహించి చిన్న చిన్న పొరపాట్లు ను సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు..అలాగే మెడికల్ ఆఫీసర్స్ వారి పరిధిలో ఉన్న ఆసుపత్రి లో వైద్య సేవలు అందించేలామరియు ఉన్న వైద్య పరికరాలను సక్రమంగా వినియోగించుకునేలా ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రం గా ఉండేలా పర్యవేక్షణ చేసుకోవాలని తెలిపారు.ప్రభుత్వం వైద్య సేవల పై పాజిటివ్ పర్సెప్షన్ ను పేషంట్స్ నుండి సేకరించడం జరుగు తుందనన్నారు.సంజీవని కార్యక్రమం ను జిల్లా లో అమలు చేసేందుకు ముందుగా ఇందుకు అవసరమైన సదుపాయాల కల్పన తో పాటు వైద్యులందరికీ అవగాహన కల్పిస్తామని,ఈ కార్యక్రమం జిల్లా లో చేపట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ సంసిద్ధం గా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.సీజనల్ వ్యాధులతో మెడికల్ ఆఫీసర్స్ అప్రమత్తం గా ఉండాలని ఆదేశించారు . ఈ సమీక్షా సమావేశం లో డిఎం&హెచ్ఓ డా.నాగరాజు, డిసిహెచ్ఎస్ డా.హిమదేవి, మెడికల్ ఆఫీసర్స్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిరవధిక కోర్టుల బహిష్కరణకు బార్ అసోసియేషన్ తీర్మానం



గద్వాల జూన్ 03 ( విజన్ ఆంధ్ర): జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు సముదాయ నిర్మాణ స్థలం ఎంపిక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్నదని, ఈ విషయంలో ప్రభుత్వ తీరును నిరశిస్తూ గురువారం ( 04.06.2026) నుండి గద్వాల బార్ అసోసియేషన్ నిరవధికంగా కోర్టుల విధుల బహిష్కరణకు తీర్మానించటం జరిగిందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సుధాకర్ తెలిపారు. అనంతపురం గుట్టల (పూడురు శివారు) వద్ద కేటాయించిన స్థలాన్ని వ్యతిరేకిస్తూ గత మూడేళ్లుగా గద్వాల బార్ అసోసియేషన్ పలు రూపాల్లో ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. సామాన్య ప్రజల సౌకర్యం, కక్షిదారులు, న్యాయవాదుల భద్రత వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ, తన నిర్ణయాన్ని మార్చుకోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ యొక్క స్థల ఎంపిక విషయంలో అనేక సాంకేతిక పరమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. ఆలాగే ఈ స్థల గుర్తింపు అనగా ఖచ్చితమైన హద్దుల నిర్ణయింపు జరగలేదు. ఇప్పటికి కూడా సర్వే డిపార్ట్మెంట్ కు గాని, ఆర్&బి ఉన్నత శాఖ అధికారులకు సైతము ఖచ్చితమైన రికార్డుల సహాయంతో స్థల ఎంపిక గందరగోళంగా ఉన్నది. ఇట్టి అనేక సాంకేతిక పరమైన విషయాలు ఇంకా పూర్తిగా ఆధికారుల వద్ద లేదు. ఈలోగా హడావిడిగా శంకుస్థాపనకు ముస్తాబు చేస్తున్నారని తెలుస్తున్నది. కాబట్టి ప్రజాధనం వృధా కాకుండా కాపాడగలరని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయటం జరిగింది. క్షేత్రస్థాయిలో న్యాయవాదులు, ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా, గద్వాల బార్ అసోసియేషన్ తీర్మానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అనంతపురం గుట్టల వద్దనే కోర్టు సముదాయ నిర్మాణ శంకుస్థాపనకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ నిర్ణయాన్ని న్యాయవాదుల తరపున గద్వాల బార్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మా నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలియ జేస్తున్నాము. ప్రజలు, వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదుల సంపూర్ణ మద్దతుతో మా న్యాయమైన డిమాండ్‌ను సాధించగలమనే విశ్వాసాన్ని అధ్యక్షుడు జి.సుధాకర్ వ్యక్తం చేశారు.

## వరల్డ్ సైకిల్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ విజయవంతం

## అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు సైకిల్ ర్యాలీ

రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 3 (విజన్ ఆంధ్ర):వరల్డ్ సైకిల్ డే సందర్భంగా ఈరోజు అంబేద్కర్ విగ్రహం నుండి బతుకమ్మ ఘాట్ వరకు భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్, వారి సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కాలుష్య నియంత్రణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సుమారు 170 మంది పాల్గొనగా, కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ తెలిపారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెరగాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల జూన్ 03( విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని, అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను గురించి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. విద్యాశాఖపై బుధవారం హైదరాబాదు నుంచి రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలలో వివిధ కోర్సుల వారీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని, వివిధ కొత్త కోర్సులను కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి క్యాంపెయిన్ చేసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలోనే చేర్పించేలా అక్కడ కలిపిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి తాగునీరు, మరుగుదొడ్లు, తదితర కనీస మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ఎస్ఎస్సి , ఇంటర్ పాసైన జిల్లా విద్యార్థులు డిగ్రీ, ఇతర కోర్సుల్లో చేరేలా సంబంధిత ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేస్తున్న మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి హృదయ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం అమలు!!

**లాయర్ల రక్షణకు భరోసా**
**తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం**
**వృత్తిపరమైన సవాళ్లు**
**- రక్షణ ఆవశ్యకత**
**బార్ అసోసియేషన్ల హర్షాతిరేకాలు**
**న్యాయవ్యవస్థ పై పెరగనున్న విశ్వాసం**







హైదరాబాద్, జూన్ 3 న్యాయవాదుల రక్షణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్, 2026, జూన్ 2, 2026 నుండి అమలులోకి వచ్చింది. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, బెదిరింపుల నేపథ్యంలో ఈ చట్టం అమలులోకి రావడం న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి, న్యాయం కోసం పోరాడే సామాన్యులకు ఒక పెద్ద ఊరటనిచ్చింది. ఇది కేవలం ఒక చట్టం కాదు, న్యాయం నిలబడటానికి, ధైర్యంగా తమ విధులను నిర్వర్తించడానికి న్యాయవాదులకు లభించిన ఒక భరోసా.

గత కొన్నేళ్లుగా న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు ప్రాణాలకు తెగించి కేసులను వాదించాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో వారికి రక్షణ కల్పించడం అత్యవసరం.

ఈ చట్టం అమలులోకి రావడంతో, న్యాయవాదులపై దాడులు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడతాయి. ఇది న్యాయవాదులు నిర్భయంగా తమ విధులను నిర్వర్తించడానికి దోహదపడుతుంది.

### బార్ అసోసియేషన్లు, న్యాయవాదుల హర్షం

ఈ చట్టం కోసం న్యాయవాద సంఘాలు చాలా కాలంగా పోరాడుతున్నాయి. వారి కృషి, పట్టుదల ఫలితంగా ఈ రోజు ఈ చట్టం వాస్తవ రూపం దాల్చింది. తెలంగాణ బార్ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఘనంగా స్వాగతించింది. రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్లు, న్యాయవాదులు ఈ నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇది న్యాయవాదుల సంక్షేమానికి, రక్షణకు ఒక మైలురాయిగా నిలుస్తుందని, తమ చిరకాల స్వప్నం నెరవేరిందని పలువురు సీనియర్ న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం తమకు మరింత ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని యువ న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు. న్యాయవాదులు సమాజంలో న్యాయం, సమానత్వం కోసం నిలబడేవారు. వారి రక్షణ సమాజ రక్షణతో సమానం. ఈ చట్టం అమలుతో, న్యాయవాదులు మరింత ధైర్యంగా, నిబద్ధతతో తమ విధులను నిర్వర్తిస్తారు. ఇది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతుంది మరియు న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేస్తుంది.

**గడ్డం రాజు**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

**- అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి**
**- ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**






హైదరాబాద్, జూన్ 03 (విజన్ ఆంధ్ర ): సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

మద్దతు ప్రకటించిన కోదండరాం : సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్,
సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 03 ( విజన్ ఆంధ్ర బ్యూరో): జూన్ 4న జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ధరూర్ మండలం గుడ్డం దొడ్డి రిజర్వాయర్ వద్ద రెండు హెలిపాడ్స్ ను ఏర్పాటు చేయడంతో సీఎంతో పాటు మంత్రులకు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. పంపు హౌస్ లోపల సీఎం మీటింగ్ ఉంటుందని, వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ టీం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ నోట్స్ తయారు చేసుకోవాలని, జిల్లా ప్రాజెక్టులతో కూడిన ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, కిందకు విద్యుత్ తీగలు వేలాడకుండా సరి చేయించాలన్నారు. సీఎం పర్యటనలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బందోబస్తును నియమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్. ఐ .ఆర్.) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి: రాజర్షిషా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 03 , (విజన్ ఆంధ్ర) కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్. ఐ.ఆర్.) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ఓటర్ల వివరాల మ్యాపింగ్ అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత జాబితాలో ఉన్న ఓటర్లందరూ, గతంలో (1-1-2002 నాటి) 'ఎస్ఐఆర్' జాబితాలో ఉన్న తమ వివరాలతో ప్రస్తుత వివరాలను తప్పనిసరిగా సరిపోల్చుకోవాలని సూచించారు. ఒకవేళ 2002 నాటి ఓటర్ల జాబితా అందుబాటులో లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఓటర్ల సౌకర్యార్థం ఆ పాత జాబితాను భారత ఎన్నికల సంఘం లేదా సీఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్లలో తమ వివరాలను సులభంగా వెతుక్కునే సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ వివరాలను వెల్లడిస్తూ.. జూన్ 15 నుండి జూన్ 24, 2026 వరకు మొదటి విడతగా ఓటర్ల జాబితా తయారీ, సిబ్బందికి శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తర్వాత జూన్ 25 నుండి జూలై 24, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారని, ఇదే సమయంలో (జూలై 24 లోపు) పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. జూలై 31, 2026న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, దీనిపై అభ్యంతరాలు, క్లెయిములను తెలియజేయడానికి జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను సెప్టెంబరు 28 లోపు పరిష్కరించి, అక్టోబరు 01, 2026న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని ప్రకటించారు. ఈ ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను పారదర్శకంగా విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ తరపున బూత్ స్థాయి ప్రతినిధులను (ఏజెంట్లను) వెంటనే నియమించుకోవాలని, జూన్ 25 నుండి బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగే సమయంలో ఏజెంట్లు సహకరించాలని, బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చినప్పుడు వారికి పూర్తి వివరాలు అందించి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, డి ఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షురాలు నలంద ప్రియా, మునిసిపల్ వైస్ చైర్మన్ రోహిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వాగులోనే యాధేచ్ఛగా అక్రమ నిర్మాణం

**కళ్లెదుటే వాగు కబ్జా అవుతున్న పట్టించుకోని అధికారులు**
**అన్యక్రాంతమవుతున్న వాగులు**



నిజామాబాద్ జూన్03:(విజన్ ఆంధ్ర ): నిజామాబాద్ నగర శివారులోని బోర్గం ( పి ) గ్రామంలో యాధేచ్ఛగా వాగులు కబ్జాకు గురవుతున్నాయి. కొందరు బడాబాబులు ఏకంగా వాగులోనే అక్రమ నిర్మాణం చేపట్టిన అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. కళ్లెదుటే వాగులో అక్రమ నిర్మాణం జరిగిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కబ్జాలకు గురవుతున్న ప్రాంతాలను శనివారం నిజామాబాద్ ఆర్డిఓ రాజేంద్రకుమార్ స్వయంగా పరిశీలించారు. కబ్జాలపై విచారణ జరిపి సమగ్ర నివేదికను అందించాలని మోపాల్ తహసిల్దార్ ను ఆదేశించారు. అయితే అంతకుముందే మోపాల్ ఆర్ఐ బృందం వాగుల కబ్జాను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిసింది. ఈ నివేదిక జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ కు అందజేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలతోనే ఆర్డీవో బోర్గంలో కబ్జా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని నాయకులే ఈ కబ్జాలకు పాల్పడినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కబ్జాల వెనుక అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు అండగా ఉన్నట్లు తెలుస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జాలకు పాల్పడిన నేతలు ప్రస్తుతం ఆ పార్టీ మారి అధికార పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో వారి కబ్జాల భాగోతం బహిర్గతమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 100 కోట్ల విలువైన భూములు అన్యక్రాంతమవుతున్న అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరించడం పలు రకాల విమర్శలకు దారి తీస్తుంది. కబ్జాదారులు అధికార పార్టీకి చెందిన నేతలు కావడం వల్లే అధికారుల చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓవైపు అక్రమాణాలపై సీరియస్ గా పరిగణిస్తుంటే జిల్లా అధికారులు మాత్రం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కబ్జాదారులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రావ్యక్తమవుతున్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాజధానికి పరుగులు పెట్టిన కబ్జాదారులు.

తమ కబ్జాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు కబ్జాదారులు ఇప్పటికే రాజధానికి చేరుకున్నట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన కొందరు నేతల ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చేందుకే రాజధానికి వెళ్లినట్లు స్థానికగా ప్రచారం జరుగుతుంది. మోపాల్ రెవెన్యూ అధికారులు ఇటీవల జరిపిన తనిఖీలో వాగులు కబ్జాకు గురైనట్లు, కబ్జా చేసిన వాటిలోనే వెంచర్లు చేసి విక్రయించినట్లు రెవెన్యూ అధికారుల తనిఖీల్లో వెళ్ళడైనట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న కబ్జాదారులు తమపై ఎలాంటి చర్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో హైదరాబాద్ కు పరుగు పరుగునా వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన నేతతో కబ్జాదారులు మంతనాలు చేసినట్లు సమాచారం.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. **RNI.NO.70731/1999** EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.